నవతెలంగాణ 1
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
బుధవారం 1 ఫిబ్రవరి 2023

సమష్టి నిర్ణయాలతోనే గ్రామాభివృద్ధి



నవతెలంగాణ-నంగునూరు

కుల మతాలకతీతంగా సమష్టి నిర్ణయాలతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని మార్కెట్ కమిటీ చైర్మన్ రాగుల సారయ్య అన్నారు. మంగళవారం నంగునూరు మండల పరిధిలోని ముండ్రాయి గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా గ్రామ సభ నిర్వహించారు. రాజగోపాల్ పేట ఎస్సై మహిపాల్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఎవరైనా కులవివక్షత పాటిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గ్రామాభివృద్ధి కోసం అందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ ఇన్స్పెక్టర్ లింగం, మాజీ ఎంపీటీసీ గుండెల్లి రాజయ్య, రైతు బంధు సమితి గ్రామ కో ఆర్డినేటర్ రాజయ్య, వార్డు సభ్యులు, దళిత సంఘాల నాయకులు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి గమ్యం చేరాలి



నవతెలంగాణ-కంగ్టి

విద్యార్థులు పట్టుదలతో చదివి అనుకున్న గమ్యం చేరుకోవాలని డీఐఈఓ గోవింద్ రావు అన్నారు.మంగళవారం స్థానిక ప్రభుత్వ కళాశాలలో నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మంచి చదువుతో బయటికివెళ్లి గురువులు గర్వపడేలా ఉన్నత స్థాయికి ఎదగాలని.. సమాజంలో గౌరవంగా బతకాలని అన్నారు. చెడు అలవాట్లకు, వ్యసనాలకు బానిసలు కాకుండా చదు వుపై శ్రద్ధ చూపాలన్నారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవంచాలన్నారు. ఎస్సై సత్యనారాయణ, జోగిపేట ప్రిన్సిపాల్ వెంకటేశం, నారాయణఖేడ్ ప్రిన్సిపాల్ కళంగి కష్ణ, కంగ్టి ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ రెడ్డి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెదక్ కలెక్టర్‌గా రాజర్షిషా

హరీష్ రంగారెడ్డి కలెక్టర్‌గా బదిలీ

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి



రాష్ట్ర ప్రభుత్వం ఐఏఎస్ అధికారుల్ని బదిలీ చేసింది. పలువురు ఐఏఎస్ అధికారుల్ని బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎ.శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. మెదక్ జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన హరీశ్ బదిలీ అయ్యారు. ఆయన రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌గా వెళ్లారు. ఆయన స్థానంలో సంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల విభాగం అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న 2017 బ్యాంచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి రాజర్షి షా మెదక్ జిల్లా కలెక్టర్‌గా పదోన్నతి పొంది బదిలీపై వెళ్లారు. సంగారెడ్డి జిల్లాలో అదనపు కలెక్టర్‌గా పరిపాలనా విభాగంలో సమర్థవంతంగా పనిచేసిన రాజర్షిషాను మెదక్ కలెక్టర్‌గా ప్రభుత్వం నియమించారు.

తహసీల్దారును కలసిన సర్పంచ్ అచ్చంగారి భాస్కర్



నవతెలంగాణ-మర్కుక్

మర్కుక్ నూతన తహసీల్దారుగా భాగ్యరేఖ ఇటీవల బాధ్యతలు చేపట్టారు. మంగళవారం మర్కుక్ సర్పంచ్ అచ్చంగారి భాస్కర్ మర్యాద పూర్వకంగా ఆమెను కలిసి శాలువాతో సన్మానించారు.

రంగనాయక సాగర్ కుడి కాల్వ



పనులను పరిశీలించిన మాజీ ఎంపీపీ

నవతెలంగాణ-నంగునూరు

మంత్రి తన్నీరు హరీష్ రావు ఆదేశానుసారంగా మంగళవారం మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి రంగనాయక సాగర్ పనులను పరిశీలించారు. నంగునూరు మండల పరిధిలోని అంక్షాపూర్, ఖానాపూర్, మసిరెడ్డి పల్లె, ఘనపూర్ గ్రామాల రైతులతో మాట్లాడారు. సంబంధిత అధికారులను



పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు.

జనరల్ బాడీ సమావేశం రద్దు

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశానికి మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప రాణి తప్ప వైస్ చైర్మన్‌తోపాటు కౌన్సిల్ సభ్యులు హాజరు కాకపోవడంతో సమావేశాన్ని అధికారులు రద్దు చేశారు. దీనితో మున్సిపాలిటీలో అసమ్మతి రాజకీయం మరోసారి బయటపడినట్లైందని ప్రజలు చర్చించుకుంటున్నా రు. రెండు మూడు రోజుల్లో చైర్ పర్సన్ పై అవిశ్వాస తీర్మానం



ప్రవేశ పెడతారనే చర్చ పట్టణంలో జోరందుకుంది.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-మద్దూరు

దూల్మిట్ట మండలంలోని హనుమతండ గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు బానోతు తిరుపతి తండ్రి బానోతు బద్దు అనారోగ్యంతో మృతి చెందారు. మృతుని కుటుంబానికి దూల్మిట్ట టిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మంద యాదగిరి 5 వేల రూపాయలను పంపించారు. సర్పంచ్ జాటోతు రేణుక కాల్ రామ్ మృతుని కుటుంబానికి అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవ తెలంగాణ మద్దూరు

ఈ నెల 1న మద్దూరు దూల్మిట్ట మండలంలోని అన్ని గ్రామాలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మద్దూరు దూల్మిట్ట విద్యుత్ శాఖ ఏఈలు సుధీర్ బాబు, శ్రీనివాసరావు మంగళవారం విలేకరులకు తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్దూరు దూల్మిట్ట మండలంలోని అన్ని గ్రామాలలో ఒంటిగంట నుండి 6 గంటల వరకు వ్యవసాయ బావులకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. ఉదయం వ్యవసాయ బావులకు కట్ చేసిన విద్యుత్తు రాత్రి సరఫరా చేస్తామని తెలిపారు.



యునాని వైద్య శిబిరానికి అపూర్వస్పందన

నవతెలంగాణ-పుల్‌కల్

సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం తాడ్ దాన్ పల్లి ప్రాథమిక ప్రభుత్వ పాఠశాల, అంగన్వాడీ కేంద్రం లో

కార్పొరేట్‌కు దీటుగా.. ప్రభుత్వ బడులు



- మన ఊరు-మన బడితో మారుతున్న రూపురేఖలు
- ఆధునిక హంగులతో ముస్తాబు
- సిద్దిపేట-35, సంగారెడ్డి-60, మెదక్‌లో 33 స్కూల్స్‌లో వందశాతం పనులు
- పనులు పూర్తియిన స్కూల్స్ నేటినుంచి ప్రారంభం



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మెదక్ జిల్లా వ్యాప్తంగా ఉమ్మడి మెదక్ జిల్లాలో 3,136 ప్రభుత్వ పాఠశాలున్నాయి. 'మన ఊరు-మన బడి' పథకం కింద 1097 ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించడం కోసం ఎంపిక చేశారు. పనులు చేయడం కోసం రూ.484 కోట్ల నిధుల్ని మంజూరు చేశారు. ఇప్పటి వరకు 128 పాఠశాలల్లో వంద శాతం పనులు పూర్తయినట్లు విద్యా శాఖ అధికారులు చెబుతున్నారు. బుధవారం మాత్రం కొన్ని పాఠశాలల్ని ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేశారు.

సిద్దిపేట జిల్లాలో 976 ప్రభుత్వ పాఠశాలున్నాయి. వీటిల్లో మన ఊరు-మనబడి కింద 343 పాఠశాలల్ని ఎంపిక చేశారు. వీటిల్లో 12 రకాల పనుల్ని చేపట్టాలని గుర్తించారు. అట్టి పనుల కోసం రూ.124 కోట్ల నిధుల్ని మంజూరు చేశారు. ఇప్పటికే 241 పాఠశాలల్లో పనులు మొదలై వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఇప్పటికే 35 పాఠశాల్లో 100 శాతం పనులు పూర్తయ్యాయి. కొన్నింటిలో ఫర్నీచర్ అందలేదు. రేపటి నుంచి పనులు పూర్తయిన పాఠశాలల్లో ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సంగారెడ్డి జిల్లాలో 1262 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. వీటిల్లో తొలి దశలో 441 పాఠశాలల్లో ఎంపిక చేసి 2429 పనుల్ని చేపట్టాలని ఎంపిక చేశారు. ఇందు కోసం రూ.210 కోట్ల నిధుల్ని మంజూరు చేశారు. మొదలు పెట్టిన పనుల్లో 1861 పనులు పూర్తవ్వగా 568 పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే రూ.26 కోట్ల నిధుల్ని బిల్లులుగా చెల్లించారు. వంద శాతం పనులు పూర్తయిన పాఠశాలలు 60 రడీగా ఉన్నప్పటికీ ఫర్నీచర్ బిగించకపోవడంతో అన్ని పనులు పూర్తయిన 13 పాఠశాలల్ని మాత్రమే బుధవారం ప్రారంభించనున్నారు. మెదక్ జిల్లాలో 898 ప్రభుత్వ పాఠశాలున్నాయి. వీటిల్లో మన ఊరు-మన బడి కింద 313 పాఠశాలల్ని ఎంపిక చేశారు. పనుల కోసం రూ.150 కోట్లు మంజూరు చేశారు. ఇప్పటి వరకు 33 పాఠశాలల్లో వంద శాతం పనులు పూర్తయ్యాయి. పర్నీచర్ వంటి చిన్న చిన్న పనులు పూర్తికానందున 3 పాఠశాల్లో మాత్రమే ప్రారంభించనున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడులు సిద్ధమవుతున్నాయి. 'మన ఊరు-మన బడి' పథకం కింద రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. వీటిని దశలవారీగా ఆధునీకరించనున్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యా బోధన అవసరాలకు సంబంధించి 12 రకాల పనుల్ని చేపట్టారు. ఎంపిక చేసిన అన్ని స్కూళ్లలో పనులు వివిధ దశల్లో ఉన్నాయి. వందశాతం పనులు పూర్తయితే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. బుధవారం నుంచి పూర్తయిన పాఠశాలల్ని ప్రారంభించనున్నారు.

నేడు ప్రారంభోత్సవాలు షురూ

మన ఊరు-మన బడి పథకంలో వంద శాతం పనులు పూర్తయిన ప్రభుత్వ పాఠశాలల్లో బుధవారం నుంచి ప్రారంభోత్సవాలు షురూ కానున్నాయి. సంగారెడ్డి జిల్లాలో మునిపల్లి మండలంలో మేలసంఘం ప్రాథమిక, ఉన్నత



పాఠశాలలు, పుల్కల్ మండలంలో గొంగలూరు ప్రాథమిక పాఠశాల, వట్‌పల్లి మండలంలో నాగులపల్లి, కల్హేరు మండలంలో క్రిష్టాపూర్, సిర్గాపూర్ మండలంలో కడపల్, హత్నూర మండలంలో బోరపట్ల, అమీన్‌పూర్ మండలంలో వీకర్ సెక్షన్‌స్కూల్, పటాన్‌చెరు మండలంలో ఇస్నాపూర్, న్యాల్‌కల్ మండలంలో మెటల్‌కుంట ప్రాథమిక, ఉన్నత, ఉర్దూ పాఠశాలలు, జహీరాబాద్ మండలంలో రంజోలే పాఠశాలల్ని ప్రారంభించనున్నారు. మెదక్ జిల్లాలో శంకరంపేట మండలంలో గజగట్లపల్లి, అల్లాదుర్గం మండలంలో కాగితంపల్లి, శివ్వంపేట మండలంలో పిల్లుట్ల పాఠశాల్ని ప్రారంభిస్తామని డీఈఓ రమేష్ తెలిపారు. సిద్దిపేట జిల్లాలో 35 పాఠశాలల్ని కూడా ప్రారంభించనున్నారు.

కార్పొరేట్‌కు మించి..



కార్పొరేట్ స్కూల్‌కు మించి ప్రభుత్వ పాఠశాలలు తయారవుతున్నాయి. విద్యార్థులకు మంచి బోధనతో పాటు మౌలిక సదుపాయాల్ని కల్పించేందుకు చేపట్టిన మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపురేఖలు మారిపోతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలు చదువుకోవాలనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరనుంది. సంగారెడ్డి జిల్లాలో 60 పాఠశాలల్లో వంద శాతం పనులు పూర్తయ్యాయి. కొంత మేరకు ఫర్నీచర్ బిగించలేదు. అందుకే తొలి రోజున 13 పాఠశాలల్లోనే ప్రారంభోత్సవాలు జరుగుతాయి. ప్రజా ప్రతినిధులు సమయాన్ని బట్టి పూర్తయిన స్కూళ్లను దశల వారిగా ప్రారంభిస్తాం. మిగతా స్కూళ్లల్లో పనులు వేగవంతం చేశాం. అన్ని స్కూల్స్ కూడా పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

- నాంపల్లి రాజేష్, డీఈఓ, సంగారెడ్డి జిల్లా

వైద్యరంగంలో దేశానికే తెలంగాణ రోల్‌మోడల్

నవతెలంగాణ-మర్కుక్

తెలంగాణ రాష్ట్రం ఇప్పటికే వైద్యరంగంలో దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని, కంటి వెలుగు కార్యక్రమంతో మరోసారి దేశానికి తలమానికం అయ్యిందని జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రాంచంద్రం యాదవ్, మర్కుక్ వైస్ ఎంపీపీ మంద బాల్ రెడ్డిలు అన్నారు. సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలంలోని చేబర్తి గ్రామంలో మంగళవారం రెండోవిడత కంటి వెలుగు కార్యక్రమాన్ని వారు గ్రామ సర్పంచ్ ఎర్రబాగు అశోక్, ఉపసర్పంచ్ గుర్రాల స్వామి, వంటి మామిడి మార్కెట్ కమిటీ డైరెక్టర్ బబ్బూరి రాందాస్ గౌడ్ తో కలిసి ప్రారంభించారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం కెసిఆర్ నిర్ణయాలు ఉంటాయన్నారు. ప్రజల అవసరాలను తెలుసుకొని పథకాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. అంధత్వాన్ని దూరం చేయడమే లక్ష్యంగా కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వెల్లడించారు. ప్రజలందరూ కంటి వెలుగు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం చేబర్తి ముదిరాజ్ సంఘం గ్రామాధ్యక్షులు గుర్రాల సురేష్ ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడివో ప్రవీణ్, డాక్టర్లు శ్రీనివాస్, ఆశాజ్యోతి,అప్తామాలిస్ట్ వికాస్, డీఈవో గణేష్, పంచాయతీ కార్యదర్శి సిద్దేశ్వర్, అత్మ కమిటి డైరెక్టర్ బబ్బూరి రాంలుగౌడ్,రైతు బంధు కోఆర్డినేటర్ జాలని బాలనర్సయ్యపీఏసీఎస్ డైరెక్టర్ సంజీవులు, ఎఎన్ఎంలు బిపాషా , అంగన్‌వాడీ టీచర్లు స్వప్న,రాణి,ఆశావర్కర్లు ధనలక్ష్మి, లతా, కోఆప్షన్ సభ్యులు గుర్రాల సురేష్,గుడాల శేఖర్ గుప్తా,సిసి కవిత,వివోఏ కవిత, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు గ్యారా మల్లేశం, నాయకులు తోట అంజనేయులు, జయరాం, బాలకృష్ణ, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ - దౌల్తాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం గొడుగుపల్లి గ్రామంలో దౌల్తాబాద్ జడ్పీటీసీ రణం జ్యోతి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. అనంతరం స్థానిక విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నయనానందకరంగా ఉండాలన్నది రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ ధ్యేయమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరికి కంటి చూపు సమస్యలు లేకుండా చేయాలన్నదే లక్ష్యమన్నారు. ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులు, మనం తినే రసాయన ఎరువులతో కూడుకున్న ఆహార పదార్థాల వల్ల కంటి సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరు పరీక్షలు చేయించుకోవాలని పిలుపునిచ్చారు. సర్పంచ్ శివ కుమార్ ఎంపీటీసీ లక్ష్మీ డాక్టర్లు గ్రామస్థులు తదితరులు ఉన్నారు.

నవ తెలంగాణ-దుబ్బాక: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని నూటికి నూరు శాతం విజయవంతం చేద్దామని ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. దుబ్బాక మండలంలోని అన్ని గ్రామాల్లో అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా పని









చేయాలని ప్రజా ప్రతినిధులు,అధికారులు,కంటి వెలుగు క్యాంపు అధికారులకు సూచించారు.మంగళవారం దుబ్బాక మండలం అచ్చుమాయిపల్లి గ్రామంలో కంటి వెలుగు కేంద్రాన్ని సర్పంచ్ సోమారపు స్వప్న స్వామి,ఉప సర్పంచ్ పర్స దేవరాజ్ ముదిరాజ్,ఎంపీటీసీ రాంరెడ్డి తో కలిసి ప్రారంభించారు. పిఎసిఎస్ చైర్మన్ శేర్ల కైలాష్,వార్డు సభ్యులు,ఎంపీడీవో వి.భాస్కర శర్మ,ఎంపిఓ నరేందర్ రెడ్డి,ఏపీఎం దాకయ్య,రామక్కపేట పీహెచ్ సి మెడికల్ ఆఫీసర్ డా.హిమబిందు, పంచాయతీ సెక్రెటరీ నీరజ పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు : నంగునూరు మండలం తిమ్మాయిపల్లి గ్రామంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ఎలా లత కృష్ణ పాల్గొని మాట్లాడుతూ అందత్వ రహిత తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని ,ఈ కార్యక్రమాన్ని గ్రామ ప్రజలందరూ సద్వినియోగపరచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లతా కృష్ణ, ఉప సర్పంచ్ జంగిటి రాజు, ఏపీఎం ఆంజనేయులు, సిసి శ్రీనివాస్ గౌడ్, పంచాయతీ కార్యదర్శి గౌసోద్దీన్, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.







సమానత్వం కోసమే పౌర హక్కుల దినం

నవతెలంగాణ -గజ్వేల్

దళితులు, అణగారిన వర్గాల సమానత్వం కోసమే పౌలు హక్కుల దినం ప్రతినెలా చివరి రోజు నిర్వహిస్తున్నామని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం గజ్వేల్ మండలం కోమటి బండ గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని అందరూ సోదర భావంతో కలిసిమెలిసి ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందని, మన హక్కులను స్వేచ్ఛగా అనుభవించే హక్కును భారత రాజ్యాంగం మనకు కలిపించడం జరిగిందని అన్నారు. ముఖ్యంగా యువకులు అందరు చట్టాలపై అవగాహనా ఎంచుకోవలని ఆయన సూచించారు. పౌరహక్కుల దినోత్సవం ముఖ్య ఉద్దేశ్యం హక్కుల అవగాహన కోసమే ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించుకుంటున్నాం అని తెలిపారు. బడుగు బలహీన వర్గాలు, దళితులు అణగారిన వర్గాల హక్కులకోసం దేశ ప్రజలందరూ సమానంగా జీవించటానికి భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ తన జీవితాన్ని ధారపోసి రాజ్యాంగం ద్వారా ప్రజలందరికీ స్వేచ్ఛగా జీవించే హక్కు అందరితో సమానంగా విద్య ,ఉద్యోగాలు రాజకీయంలో సమాన హక్కులను కల్పించడం జరిగిందని అన్నారు. దళితులకు ముఖ్యమంత్రి కేసీఆర్ కాంట్రాక్టు విధానంలో రిజర్వేషన్లు కలిపించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. గ్రామంలో ప్రజలందరు కలిసికట్టుగా ఉంటూ గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలపాలని సూచించారు. గ్రామంలో ఉన్న సమస్యలపై రెవిన్యూశాఖ మండల అభివృద్ధి అధికారులు రక్షణకొరకు పోలీస్ అధికారులు దృష్టికి తీసికెళ్లి సమస్యలు పరిష్కారం చేసుకోవాలని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం మన ముఖ్యమంత్రి కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా గురుకులాలు ఏర్పాటు చేసి ప్రత్యేకమైన విద్యను అందిస్తున్నారని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అన్ని కులాలకు మతాలకు ప్రాధాన్యం కలిపిస్తున్నారని అన్నారు. కుల మత తారతమ్యా బేధాలు లేకుండా ప్రభుత్వం నుండి వచ్చే సంక్షేమ కార్యక్రమాలు పెన్షన్లు , రైతుబంధు, రైతుభీమా, కేసీఆర్ కిట్, కళ్యాణ లక్ష్మీ వంటి పథకాల ద్వారా అందరికి అందిస్తున్న విషయాన్ని ఆయన స్పష్టంచేశారు..ముఖ్యమంత్రి కేసీఆర్ రాజ్యాంగం ద్వారా కల్పించిన హక్కులను అందరికి అందేలా సమానా అవకాశాలు కలిపిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేయడం జరుగుతుందని అన్నారు. కావున ప్రతి ఒక్కరూ తమ హక్కులను అనుభవించాలని వాటిని దుర్వినియోగపర్చకుండా ఉండేలా అవగాహన కలిగి ఉండాలని అన్నారు .అందుకు తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయని ఆయన అన్నారు. కార్యక్రమంలో సర్పంచి శేఖర్ పటేల్, వైస్ ఎంపీపీ కృష్ణ గౌడ్ , తహసిల్దార్ బాల్ రాజు ,ఆర్ ఐ కృష్ణా ఆత్మకమిటి డైరెక్టర్ భాస్కర్, బారాస నాయకులు గ్రామ ప్రజలు అధికారులు పాల్గొన్నారు..

నవతెలంగాణ-చేర్యాల : కుల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తహసీల్దార్ ఎస్.కె.ఆరిఫా పిలుపునిచ్చారు. మండల పరిధిలోని చుంచనకోట గ్రామంలో మంగళవారం సర్పంచ్ ఆది శ్రీనివాస్ అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. దళితుల హక్కులు, చట్టాలు, అంటరానితనం నిర్మూలన, బాల కార్మికుల చట్టాలు,ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ పై తహసీల్దార్ అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ తాండ్ర నవీన్ రెడ్డి, మాల మానాడు రాష్ట్ర కార్యదర్శి, దళిత రత్న బుట్టి సత్యనారాయణ, కర్రోల నవజీవన్, వార్డెన్ రాజయ్య, మాజీ ఉపసర్పంచ్ గొర్రె శ్రీనివాస్, వికలాంగుల వేదిక జిల్లా అధ్యక్షులు సుతారి రమేష్, విశ్రాంత తహసీల్దార్ శ్రీహరి,వీ ఆర్ ఏ లు, కారోబార్, అంగన్వాడి టీచర్లు, ఆశ వర్కర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మద్దూరు: పౌరుల హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మద్దూరు ఏఎస్ఐ విజయ్ కుమార్ అన్నారు. వంగపల్లి గ్రామంలో సర్పంచ్ గంగి భాగ్యలక్ష్మి శ్రీనివాస్ అధ్యక్షతన పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మాట్లాడుతూ పౌరుల హక్కులకు ఎవరైనా భంగం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు కులం పేరుతో దూషించిన చట్ట ప్రకారం నేరం అని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ యాదగిరి, ఎంపీఓ కాజా మొయినుద్దీన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన దళితులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలివ్వాలి: కేవీపీఎస్



నవతెలంగాణ-సంగారెడ్డి

అరులైన దళితులందరికీ ఇండ్లు, ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని.. దళితబంధుకు బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించాలని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) సంగారెడ్డి జిల్లా కమిటీ సమావేశం మంగళవారం కేవల్ కిషన్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వచ్చిన తర్వాత దళితులకు ఒక్క ఇళ్ల స్థలం కూడా ఇవ్వలేదన్నారు. ఎనిమిదేండ్లుగా ఇళ్ల స్థలాలు లేక అనేకమంది దళితులు అద్దె గహాల్లో, గుడిసెల్లో ఉంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్ రూమ్‌లు ఇవ్వాలని.. సొంతస్థలం ఉన్నవారికి మూడు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ప్రజాసంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఈనెల 3న మండల కేంద్రాల్లో నిరసనలు.. 9న చలో హైదరాబాద్‌లో పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు పి. అశోక్, జిల్లా ఉపాధ్యక్షులు కొటారి నర్సింలు, శివకుమార్ జిల్లా సహాయ కార్యదర్శిలు రామచందర్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భేల్ ప్రభుత్వ విద్యార్థుల ప్రతిభ అత్యద్భుతం

- 500 మంది విద్యార్థులకు హర్ ఘర్ తిరంగా ప్రతిభా సర్టిఫికెట్ ప్రదానం
- భేల్ జీఎంహెచ్ఆర్ మగేంద్రవర్మన్



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురంలోని భేల్ టౌన్షిప్‌లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు విద్యతో పాటు అన్ని విషయాల్లో ప్రత్యేక ప్రతిభ కనబరుస్తున్నారని భేల్ కంపెనీ జీఎంహెచ్ఆర్ మగేంద్ర వర్మన్ కొనియాడారు. మంగళవారం భేల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆజాదీకా అమృత్ మహెూత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యలో మంచి మార్కులు సాధిస్తూ, ఆటాపాట , నృత్యాల్లో కూడా ప్రత్యేక ప్రతిభ చాటుకుంటున్నారని కొనియాడారు. విద్యార్థులకు మంచి విద్యను అందిస్తున్న ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. భేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో సహకరించిన పాఠశాల ప్రిన్సిపల్ రాములు, సిబ్బందిని జీఎం అభినందించారు. అనంతరం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ప్రతిభ సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు వేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఎజీఎం సూరన్ ప్రసాద్, ఐఆర్ అధికారులు అమిత్, సత్యంబాబు, సీనియర్ మేనేజర్ ఆమ్లన్ దత్ , ఉపాధ్యాయులు దామోదర్, కవిత, విజయ్ కుమార్, హెచ్ ఆర్, హెచ్ ఆర్ డీసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డోనార్స్ సమావేశానికి హుస్నాబాద్ నాయకులు



నవ తెలంగాణ-హుస్నాబాద్ రూరల్

వరంగల్ కాజీపేటలోని పీడీటీసీ సెంటర్‌లో మంగళవారం రాష్ట్రస్థాయి డోనర్స్ సమావేశాన్ని బాలవికాస సంస్థ నిర్వహించింది. ఈ సమావేశానికి హుస్నాబాద్ నాయకులు హాజరయ్యారు. బాలవికాస సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న హుస్నాబాద్ ప్రాంత నాయకులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బాలవికాస వ్యవస్థాపకురాలు బాలక్క, ఈడి శౌరెడ్డి, లతక్క, డైరెక్టర్ శోభ, హుస్నాబాద్ మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకట్, వైస్ చైర్మన్ ఐలేని అనిత శ్రీనివాస్ రెడ్డి,హుస్నాబాద్ మాజీ సర్పంచ్ కెడం లింగమూర్తి, హుస్నాబాద్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చిత్తారి పద్మ, హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బంక చందు, జిల్లా మాజీ కన్వీనర్ వెన్నరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ జీవితంలో బదిలీలు సహజం



నవతెలంగాణ-సంగారెడ్డి

ఉద్యోగ జీవితంలో బదిలీలే సహజమేనని ఎస్పీ రమణకుమార్ అన్నారు. జిల్లాలోని పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహించిన ఎస్. ప్రభాకర్ రెడ్డి.. రంగారెడ్డి జిల్లా చేవెళ్ళ ఏసీపీగా, డీసీఆర్‌బి ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన డి.జెలెందర్‌రెడ్డి రాచకొండ కమిషనరేట్‌కు బదిలీ అయిన సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎస్పీ పాల్గొని మాట్లాడారు. ఉద్యోగి, ఉద్యోగ జీవితంలో ట్రాన్స్ఫర్ అనేది సహజమే అన్నారు. జిల్లాకు వారందించిన సేవలు మరువలేనివాని, ఇలాంటి మరిన్ని సేవలను పోలీస్ శాఖకు అందించాలని, వారి సేవలను కొనియాడుతూ, జ్ఞాపికలను అందజేశారు.. యస్.జనార్ధన్ ఎఆర్ డీఎస్పీ, మహేష్ గౌడ్, లాలూనాయక్ యస్.బి. ఇన్‌స్పెక్టర్స్, వినాయక రెడ్డి ఇన్‌స్పెక్టర్స్ భానూర్ పీఎస్, ప్రవీణ్ రెడ్డి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పటాన్‌చెర్వు, రామరావ్ ఆర్ఐ, డీసీఆర్‌బీ, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2023-నూతన సంవత్సర డైరీని మంగళవారం సంగారెడ్డి కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా కలెక్టర్ డా.శరత్, అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డిలు కలిసి సంయుక్తంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జర్నలిస్టు సంఘాలు జర్నలిస్టుల సమస్యతో పాటు సమాజాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. సంఘాలు గుర్తింపు కోసం కాకుండా క్షేత్రస్థాయిలో పాత్రికేయుల ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారాల కోసం పాటుపడాలని కోరారు. అనంతరం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ రమణ కుమార్ జర్నలిస్ట్ డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు ఎం.సాయినాథ్, కార్యానిర్వహక అధ్యక్షులు నజీర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, కోశాధికారి నాగభూషణం, కార్యవర్గ సభ్యులు రహీం, జయవంత్, రమేష్, సత్తార్, శ్రీశైలం, రాజేశ్వర్, నర్సిములు, శ్రీకాంత్, రమేష్, సతీష్, మోహన్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

కేటాయించిన దుకాణాల్లోనే విక్రయించుకోవాలి



నవతెలంగాణ-జహీరాబాద్

ప్రభుత్వం కేటాయించిన దుకాణాల్లోనే పువ్వులను విక్రయించుకోవాలని అదనపు కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని జహీరాబాద్ పట్టణం లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో ఏడుమంది పువ్వుల విక్రయదారులకు మంగళవారం దుకాణాలను కేటాయించారు. ఈ సందర్భంగా రాజర్షి షా మాట్లాడుతూ.. వారికి కేటాయించిన దుకాణ కట్టలపైనే పువ్వులను విక్రయించుకోవాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే వారిపట్ల కఠినంగా తీసుకుంటామన్నారు. మున్సిపల్ కమిషనర్ మల్లారెడ్డి, పట్టణ ఎస్సై శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నెల రోజులపాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్ అమలు

నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజులు (ఫిబ్రవరి 1వ నుంచి 28 వరకు) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ రమణ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కాబట్టి పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా సంగారెడ్డి జిల్లా ప్రజలు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించొద్దన్నారు. ప్రజా ధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టొద్దన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులకు సహకరించాలన్నారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మోడల్ స్కూల్‌ని సందర్శించిన జాయింట్ డైరెక్టర్



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం మండలం వెలిమెలలోని తెలంగాణ మోడల్ స్కూల్‌ను రాష్ట్ర విద్యాశాఖ మోడల్ స్కూల్స్ జాయింట్ డైరెక్టర్ సరోజిని మంగళవారం సందర్శించారు. పదో తరగతి మరియు ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం విద్యార్థులతో ఆమె సంభాషించారు. పబ్లిక్ పరీక్షలలో విజయం కోసం ఉపయోగకరమైన చిట్కాలను విద్యార్థులకు బోధించారు. అనంతరం సిబ్బంది సమావేశంలో అధ్యాపకులందరూ ఉత్తమంగా కృషి చేసి ప్రశంసనీయమైన ఫలితాలను సాధించాలని సూచించారు.

అంగన్వాడీ, ఆశా వర్కర్ల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాలి



నవతెలంగాణ-జహీరాబాద్

అంగన్వాడీ, ఆశా వర్కర్ల సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడాలని జహీరాబాద్ ఎమ్మెల్యేకు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మహిపాల్ మాట్లాడుతూ.. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్స్, ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అసెంబ్లీ సమావేశాల్లో చర్చించాలని, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యేకు విన్నవించామన్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్, గ్రాడ్యుటీ, కనీస వేతనాలు, కార్మిక చట్టాల రద్దు, ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించడం తదితర సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశామన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఆశ వర్కర్స్ యూనియన్(సిఐటియు) నాయకులు విజయలక్ష్మి, శోభ, అనురాధ, శాహేదా బేగం, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వలిమా వేడుకలో పాల్గొన్న ప్రముఖులు



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పట్టణంలోని జెకె ఆటో యజమాని సయ్యద్ జాఫర్ అలీ కుమారుడి వలిమా వేడుకలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, టీపీసీసీ నాయ కులు వై.నరోత్తం, సామాజిక కార్యకర్త ఢిల్లీ వసంత్, కర్ణాటక మాజీ ఎమ్మెల్యే నసీం పటేల్‌లు పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం వారి కుటుం బ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జహీరాబాద్ నియోజకవర్గం అన్ని వర్గాల వారికి, ప్రాంతాల వారికి వ్యాపారాలు నిర్వహించుకునేందుకు నిలయంగా మారిందన్నారు. ఎంపీజే అధ్యక్షులు మహ మ్మద్ అయుబ్, వివిధ సంఘాల నాయకులు సయ్యద్ యాహంబ్ ,మహమ్మద్ మహమ్మద్ బాసిత్, బాబి, మిథున్ రాజ్, యూని వర్స్ శ్రీనివాస్, మహబూబ్ అలీ, జనార్ధన్, సయ్యద్ మసూద్ హుస్సేన్, యూసుఫ్, శ్రీకాంత్, మహమ్మద్ ఖైరాత్ అలీ, మహమ్మద్ యూసుఫ్, మహమ్మద్ మహూదూం, ఎస్.కె జయినుద్దీన్, బాబా, ఫక్రుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాయికోడ్‌కు ఎమ్మెల్యే క్రాంతికిరణ్ రాక

నవతెలంగాణ-రాయికోడ్

మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో నిర్వహించే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేయడానికి నేడు (బుధవారం) ఉదయం 11 గంటలకు ఆందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ వస్తున్నారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బస్వరాజ్ పాటిల్, ప్రధాన కార్యదర్శి కొల్లూర్ శంకర్‌లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రూ.కోటి 4లక్షల నిధులతో రాయికోడ్ వ్యవసాయ మార్కెట్ యార్డులో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి, రెండో విడత కంటి వెలుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరవుతారన్నారు. అనంతరం ధర్మాపూర్ గ్రామంలో గృహప్రవేశ వేడుకలో పాల్గొంటారన్నారు. అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన లకు మండలంలోని ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, శ్రేణులు పార్టీ కార్యకర్తలు, అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్థిక ఇబ్బందులతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య



(ఫైల్)

నవతెలంగాణ-హత్నూర

ఆర్థిక ఇబ్బందులను తట్టుకోలేక ఆటో డ్రైవర్ ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన హత్నూర పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతలచెరువు గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలచెరువు గ్రామానికి చెందిన నీరుడి ప్రసాద్(30) వృత్తి రీత్యా ఆటో డ్రైవర్. అతనికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. అయితే డ్రైవర్ వృత్తి ద్వారా వస్తున్న ఆదాయం కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో అప్పుడప్పుడు ఇంట్లో గొడవ జరిగేది. దీంతో ఆర్థిక ఇబ్బందుల వల్ల తీవ్ర మనస్థాపానికి గురై మంగళవారం ఇంట్లోనే ఉరేసుకున్నాడు. అతడి భార్య గమనించి.. స్థానికుల సహాయంతో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించింది. కాగా అప్పటికే ప్రసాద్ మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై లక్ష్మారెడ్డి తెలిపారు.

వావిలాలలో శివ స్వాముల పడిపూజ



నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని వావిలాల గ్రామంలో మంగళవారం కడారి రఘు రాంగౌడ్ ఆధ్వర్యంలో శివ స్వాముల మహా పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా జిన్నారం మండల పరిషత్ అధ్యక్షులు దమ్మ గౌని రవీందర్ గౌడ్, సంగారెడ్డి జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు కాటా సుధా శ్రీనివాస్ గౌడ్, వావిలాల గ్రామపంచాయతీ ఉపసర్పంచ్ నవనీత రెడ్డి, బొంతపల్లి ఎంపీటీసీ సీనియర్ కాంగ్రెస్ నేత సురభి నాగేందర్ గౌడ్, కొడకంచి మాజీ ఎంపీటీసీ వడ్డే కృష్ణలు పాల్గొని ప్రత్యేకంగా శివ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక నేతలు హరి శంకర్ గౌడ్, కర్ణాకర్, సుధాకర్, నాయకులు శివ స్వాములు, గ్రామస్తులు, పాల్గొన్నారు.

సర్కార్ బడులు.. సౌకర్యాలు మెరుగు



- రూ.85 లక్షలతో ముస్తాబైన మెటల్‌కుంట పాఠశాలలు
- మనఊరు-మనబడితో పాఠశాలలకు పునరుజ్జీవం
- రాష్ట్ర ప్రభుత్వ చొరవతో విద్యార్థులకు తీరిన ఇబ్బందులు
- పూర్తైన అభివృద్ధి పనులను నేడు ప్రారంభించనున్న కలెక్టర్, జెడ్పీచైర్‌పర్సన్, ఎమ్మెల్యే

నవతెలంగాణ-న్యాల్‌కల్

ఎంతోమంది మహనీయులకు విద్యాబుద్ధులు నేర్పిన ప్రభుత్వ బడులు కాలక్రమేణా కనుమరుగవుతున్నాయి. కార్పొరేట్ విద్యాసంస్థలు పుట్టగొడుగుల్లా వెలుస్తుండడంతో.. సర్కారు బడులకు ఆదరణ తగ్గింది. దీనికితోడు ప్రయివేటు పాఠశాలల్లో ఆంగ్ల బోధన ఉండడంతో.. ప్రజలు అటువైపే అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలకు పునర్ వైభవం తీసుకురావాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే సర్కారీ బడుల్లో ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టింది. విద్యార్థులకు సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, ఉచిత యూనిఫాం లాంటివి అందజేసి ప్రభుత్వ విద్యను ప్రోత్సహిం చింది. అయినప్పటికీ పాఠశాలలు శిథిలావస్థకు చేరడం, సరైన మరుగుదొడ్లు లేకపోవడం, తాగునీటి సమస్య తీవ్రంగా ఉండడంతో ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రాధాన్యత నివ్వలేదు. దీంతో పాఠశాలలకు మరమ్మతులు చేపట్టడం, కొత్త భవనాలు నిర్మించడం కోసం ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగానే 'మన ఊరు- మన బడి' కార్యక్రమాన్ని తీసుకువచ్చింది. ఈ కార్యక్రమానికి మంచి స్పందన రావడంతో.. చాలా గ్రామాల్లోని సర్కారీ బడులన్ని సౌకర్యాలతో విద్యార్థులకు అందుబాటులోకి వచ్చాయి.

న్యాల్కల్ మండలంలోని మెటల్‌కుంట గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక, ఉర్దూ మీడియం స్కూలుతో కలిపి మూడు పాఠశాలలు ఉన్నాయి. అయితే ఈ మూడు పాఠశాలలకు కలిపి ప్రభుత్వం రూ.85 లక్షలు వెచ్చించి.. విద్యార్థుల సమస్యలను పరిష్కరించింది. ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు ఉండగా.. 397 మంది పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారు. కాగా హెచ్ఎం ప్రభాకర్ రావు చొరవతో పాఠశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మన ఊరు మన బడిలో పనుల్లో ప్రహరీ, భోజనశాల, కిచెన్ షెడ్, మరుగుదొడ్లు, తరగతి గదులకు మరమ్మత్తులు, విద్యుత్, తాగునీటి సౌకర్యం లాంటివి ఏర్పాటు చేశారు. అంతేకాకుండా స్కూలు మొత్తం అందంగా రంగులు వేశారు. అలాగే ప్రాథమిక పాఠశాలలో 151 విద్యార్థులు ఉన్నారని హెచ్ఎం కాశీనాథ్ తెలిపారు. కాగా రూ.1.50 లక్షల వ్యయంతో మాజీ ఎంపీటీసీ జగన్నాథ్, బాబు, శ్రీనివాస్‌లు తెలంగాణ సరస్వతీ విగ్రహాన్ని చేయించి పాఠశాలలో ఏర్పాటు చేశారు. ఇలా అటు ప్రభుత్వ తోడ్పాటు, ప్రజల సహకారంతో మెటల్‌కుంటలోని మూడు పాఠశాలలు అందంగా తయారయ్యాయి. ఈ మన ఊరు - మన బడిలో చేపట్టిన పనులన్నీ పూర్తి అవడంతో.. నేడు వీటిని ప్రారంభించనున్నారు.

పూర్తైన పనులను నేడే ప్రారంభించనున్న కలెక్టర్..

మన ఊరు-మనబడి కార్యక్రమంలో భాగంగా పూర్తైన పనులను కలెక్టర్ శరత్, జెడ్పీ చైర్‌పర్సన్ మంజు శ్రీ జైపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే మాణిక్‌రావులు నేడు ప్రారంభిం చనున్నారు. ఉదయం 10.30 గంటలకు పాఠశాలలకు ఎమ్మెల్యే వస్తున్నారు. దీంతో ఎంపీడీఓ వెంకట్ రెడ్డి, ఎంఈ ఓ మారతి రాథోడ్, మెటల్ కుంట సర్పంచ్ పీటర్ రాజు, ఎంపీఓ సురేష్, పాఠశాల హెచ్ఎంలు ప్రభాకర్ రావు, కాశీ నాథ్‌లు ఏర్పాట్లను మంగళవారం పరిశీలించారు.





మంచిగా పాఠాలు చెబుతున్నారు



మెటల్‌కుంట ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయులు మంచిగా పాఠాలు చెబుతున్నారు. టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు పెడుతున్నారు. పాఠశాలలో మంచినీరు, టాయిలెట్స్ లాంటి సౌకర్యాలు మెరుగుపరిచారు.

-శిరీష, విద్యార్థి

ప్రయివేటుకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు..



ప్రభుత్వం పాఠశాలలు ప్రయివే టుకు ధీటుగా తయారవుతున్నాయి. మన ఊరు-మనబడి కార్యక్రమంతో పాఠశాలలకు పునర్ వైభవం వస్తున్నది. జిల్లా పరిషత్ పాఠశాల తరగతి గదుల్లో నా సొంత ఖర్చులతో సీసీ కెమెరాలను అమర్చాం. గ్రామస్తుల సహకారంతో పాఠశాలను బాగు చేశాం.

- ప్రభాకర్‌రావు, జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం

కంటి సమస్యలు ఉన్న ప్రజలను వదిలివేయొద్దు

- 9 గంటలకల్లా క్యాంపు ప్రారంభమవ్వాలి
- అర్హత గల మొత్తం జనాభాను స్క్రీనింగ్ చేయాలి
- జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలో కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా కంటి సమస్యలు ఉన్న జనాభా వందశాతం కవర్ అయ్యేలా రోజువారి షెడ్యూల్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో వైద్య ఆరోగ్య శాఖ, అనుబంధ శాఖలతో కంటి వెలుగు కార్యక్రమం పై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోజు వారి షెడ్యూల్ కచ్చితంగా ఫాలో కావాలన్నారు. ప్రతీరోజు 70 శాతం లక్ష్యం పూర్తి కావాలని, గ్రామపంచాయతీ వార్డు వారీగా, మున్సిపల్ లో వార్డు వారీగా ఏరియా వారీగా రోజువారి షెడ్యూల్ చేసుకోవాలని సూచించారు. ప్రాపర్‌గా జిల్లాలో అర్హత గల జనాభా మొత్తాన్ని స్క్రీనింగ్ చేయాలని తెలిపారు. కంటి సమస్య ఉన్న ప్రజలను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలి వేయొ ద్దని, వంద శాతం స్క్రీనింగ్ చేయాలని తెలిపారు. ప్రతిరోజు ఉదయం 9 గంటలకల్లా కంటి వెలుగు క్యాంపు ప్రారంభం కావాలని, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓలు, ప్రత్యేక అధికా రులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఐసిడిఎస్ అంగన్వాడీలు, పంచాయతీ సెక్రటరీలు, ఏఎన్ఎంలు, ఆశాలు పబ్లిక్ మొగలైజేషన్ను ప్రాపర్ గా ప్లాన్ చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజు కనీసం 200 మందిని స్క్రీనింగ్ చేయాలని, సరాసరి 175-225 మంది వరకు స్క్రీనింగ్ జరగాలన్నారు. కంటి వెలుగు టీమ్లకు నాణ్య మైన భోజనం అందించాలని, టీమ్ వారికి ఏర్పాటు చేసిన వసతిలో తప్పనిసరిగా ఉండి, సమయానికి రావాలని సూచించారు. ట్యాబ్ ఎంట్రీలో ఎలాంటి పొరపాట్లు జరిగిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రీడింగ్ అద్దాలు ఇచ్చిన వారందరిదీ ఫోటో తీసుకుని అప్లోడ్ చేయాలని, డాటా ఎంట్రీ ఆపరేటర్ కు సంబంధిత యాప్‌లో ఏ విధంగా ఏమి అప్లోడ్ చేయాలన్న విషయాలపై అవగాహన కల్పించాల న్నారు. కోర్టు, జైలు, చక్కెర కర్మాగారాలు, తదితర ప్రాంతా లలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేయాలని డి.యం.అండ్ హెచ్ఓ కు సూచించారు. అదనపు కలెక్టర్లు రాజర్షి షా, వీరారెడ్డి, జడ్పీ సీఈవో ఎల్లయ్య, డిపిఓ, డీఆర్‌డిఓ, డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓలు, ప్రోగ్రాం ఆఫీసర్లు, ఐసిడిఎస్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ప్రభుత్వం



నవతెలంగాణ-జహీరాబాద్

ఆపదలో ఉన్నవారికి తమ ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటున్నదని ఎమ్మెల్యే మాణిక్‌రావు అన్నారు. మండలంలోని చిరాగ్‌పల్లీ గ్రామానికి చెందిన జి.కృష్ణవేణికి రూ.2,00,000 విలువ గల ఎల్ఓసి మంజూరు కాగా.. మంగళవారం ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆపద విషయాన్ని తమ దృష్టికి తీసుకువస్తే.. సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి సహకారం అందించేందుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ సహకారంతో ఎంతోమంది ఉన్నతమైన వైద్యం పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ఇజ్రాయేల్ బాబీ తదితరులు పాల్గొన్నారు.



అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఆనంద్‌రెడ్డి, ప్రవీణ్ రెడ్డి

నవతెలంగాణ-ఐడిఏబొల్లారం

బొల్లారం మున్సిపాల్టీ పరిధిలోని లక్ష్మీ నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సరస్వతి దేవి మండపం వద్ద సోమవారం రాత్రి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ యువత నాయకులు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి రెడ్డి, ప్రవీణ్ రెడ్డిలు సరస్వతి దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కాలనీ వాసులతో కలిసి అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్నదాన వితరణ చేశారు. యువకులు రవితేజ , సునీల్, మోహన్, బబ్లు, అనసు, రవి, కాలనీవాసులు పాల్గొన్నారు.

అమీన్‌పూర్ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- 90 లక్షల లీటర్ల నీటి సామర్థ్యంతో నాలుగు భారీ రిజర్వాయర్ల నిర్మాణం
- వేసవిలోపు ప్రతీ ఇంటికి రక్షిత మంచినీరు



నవతెలంగాణ-అమీన్‌పూర్

శరవేగంగా అభివృద్ధి చెందుతున్న అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా ఏర్పాటవుతున్న ప్రతీ కాలనీకి రక్షిత మంచినీరు అందించేందుకు నాలుగు భారీ రిజర్వాయర్లు నిర్మిస్తున్నామని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని బంధం కొమ్ము, శ్రీ కృష్ణ బృందావన్ కాలనీ సమీపంలో నాలుగు కోట్ల రూపాయల అంచనా వ్యయంతో 10 లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మించతలపెట్టిన రిజర్వాయర్ నిర్మాణ పనులకు స్థానిక మున్సిపల్ చైర్మెన్ తుమ్మల పాండురంగా రెడ్డి, వైస్ చైర్మెన్ నందారం నరసింహా గౌడ్‌లతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల హయాంలో అమీన్‌పూర్ మున్సిపాల్టీలో ప్రతిరోజు ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా జరిగేదని.. ప్రజలు నరకయాతన పడేవారన్నారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతీ ఇంటికి ప్రతిరోజు రక్షిత మంచినీరు అందిస్తున్నామన్నారు. అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని పీజేఆర్ కాలనీ, లాలాబావి కాలనీ, బీరంగూడ శివాలయం గుట్ట పైన నిర్మిస్తున్న రిజర్వాయర్ల పనులు తుది దశకు చేరుకున్నాయన్నారు. వచ్చే వేసవిలోపు 90శాతం గృహాలకు మంచినీరు అందిస్తామన్నారు. రిజర్వాయర్ల నిర్మాణం పూర్తయితే.. ప్రతిరోజు ఒక కోటి 25 లక్షల లీటర్ల నీటిని పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు.

భవానిపురం పరిధిలోని ఎన్‌బిఆర్ కాలనీలో ఎమ్మెల్యే జీఎంఆర్ పర్యటించారు. కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి, సంబంధిత మున్సిపల్ చైర్మెన్, వైస్ చైర్మెన్‌లతో చర్చించి పరిష్కరించనున్నట్టు తెలిపారు. అనంతరం పెద్ద చెరువు సాయిబాబా దేవాలయం సప్తమ వార్షికోత్సవం, వెదిరి కాలనీ గణపతి దేవాలయం వార్షికోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే జీఎంఆర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రెజాకు ఐఏసీసీ ఉత్తమ పరిశోధనా అవార్డు



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం స్కూల్ సైన్స్‌లోని గణిత శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ మోతహర్ రెజాను ఇంటర్నేషనల్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ కమ్యూనిటీ (ఐఏసీసీ) 2023 సంవత్సరానికి 'ఉత్తమ పరిశోధకుడి' అవార్డుతో సత్కరించింది. అధునాతన కంప్యూటింగ్‌లో డాక్టర్ రెజా పరిశోధన, లోతైన అభ్యాసం, సమాంతర కంప్యూటింగ్‌కు గుర్తింపుగా ఈ అవార్డును ఇచ్చి గౌరవించినట్టు విశ్వవిద్యాలయ వర్గాలు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. హైదరాబాదులోని సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో ఇటవల జరిగిన 12వ ఐఏసీసీ సదస్సులో తెలంగాణ కార్మిక, ఉపాధి శాఖల మంత్రి మల్లారెడ్డి, నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్బీఏ) చైర్మెన్ ప్రొఫెసర్ కె.కె.అగర్వాల్ చేతుల మీదుగా డాక్టర్ రెజా ఈ అవార్డును అందుకున్నట్టు తెలిపారు. బిట్స్ పిలానీ నుంచి ఎంటెక్, ఐఐటీ ఖరగ్పూర్ నుంచి పీహెచ్ డీ జర్మనీలోని ఫ్రెడరిక్ అలెగ్జాండర్ విశ్వవి ద్యాలయం నుంచి పోస్ట్ డాక్ డిగ్రీలను పొందిన డాక్టర్ రెజా గత కొన్నేళ్లగా వివిధ అప్లికేషన్లలో డీప్ లెర్నింగ్, హెచ్పీ సీలపై పనిచేస్తున్నట్టు వివరిం చారు. అధునాతన న్యూ మరికల్ టెక్నిక్లను ఉపయోగించి కంప్యూ టేషనల్ అప్లైట్ మ్యాథమెటిక్స్ (సీఎఫ్, టర్బులెన్స్ మోడలింగ్)లో కూడా పరి శోధనలు చేయడంతో పాటు ప్రసిద్ధ ఎసీసీఐ- ఇంటెక్స్ జర్నల్స్ ఆయన పలు పరిశోధనా పత్రాలను ప్రచు రించినట్టు తెలియజేశారు. భారత ప్రభుత్వరంగ సంస్థల ఆర్థిక సౌజన్యంతో ఆయన ఈ పరిశోధనలను చేపడుతున్నట్టు పేర్కొన్నారు.

పగటి పూటనే 12 గంటల నాణ్యమైన కరెంట్ ఇవ్వాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

జిల్లాలో రైతులకు పగటి పూటనే 12 గంటల నాణ్యమైన కరెంటు ఇవ్వాలని తెలంగాణ రైతు సంఘం, సీపీఐ(ఎం) జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం విద్యుత్ జిల్లా కార్యాలయం డీఈ శ్రీనివాస్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు మాట్లాడుతూ.. రైతులకు పగటి పూటనే నాణ్యమైన 12 గంటల కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ముఖ్యంగా వ్యవసాయం మొత్తం బోరు బావుల ద్వారానే కొనసాగుతుందన్నారు. ఎండాకాలం మొదలు కాక ముందే అప్రకటిత విద్యుత్ కోతలు మొదలయ్యాయన్నారు. ప్రస్తుతం ఉల్లి, కూరగాయ పంటలు వేసే సీజన్ కావడంతో విద్యుత్ కోతలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. పొలాల వద్ద ఉల్లినారు వేసేందుకు కూలీలను తీసుకెళ్లి కరెంటు ఎప్పుడు వస్తుందో తెలియక పొద్దంతా కూర్చోబెట్టి కూలీలకు డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. ఎప్పుడు త్రీఫేస్ వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి ఉన్నదన్నారు. జిల్లాలో రాత్రిపూట కరెంటుతో గతంలో అనేకమంది రైతులు ప్రాణాలు కోల్పోయా రన్నారు. ప్రస్తుతం కూడా ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందన్నారు. కాబట్టి పగటిపూటనే 12 గంటల పాటు కరెంటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని యెడల జిల్లా వ్యాప్తంగా రైతులను సమీకరించి ఆందోళన చేపడుతామని హెచ్చరిం చారు. రైతుసంఘం జిల్లా కార్యదర్శి నరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షులు రాజయ్య, జిల్లా నాయకులు యాద వరెడ్డి, శ్రీనివాస్, భూషణం,రామాంజనేయులు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రూ క్రాఫ్ట్ కంపెనీ పై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-సదాశివపేట

కాలుష్య వ్యర్థ జలాలు వెదజల్లుతూ మూగజీవుల ప్రాణాలు బలిగొంటున్న బ్రూ క్రాఫ్ట్ కంపెనీపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి వినోద డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ఈ కంపెనీ వల్ల అనేక పంటలు దెబ్బతినడమే కాకుండా మూగజీవులకూ ప్రాణ హాని ఉన్నదన్నారు. ఈ కంపెనీ పై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గతంలోనే అనేక నిరసనలు చేపట్టారన్నారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయిందన్నారు. దీంతో మూగజీవాలు మృత్యువాత పడుతున్నాయన్నారు. వాటన్నింటికి నష్టపరిహారం చెల్లించాలన్నారు. అంతేకాకుండా ఈ వ్యర్థ జలాలతో పంటలు దెబ్బతినడమే కాకుండా.. ప్రజలూ కూడా అంతులేని రోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాగం ఈ బ్రూ క్రాఫ్ట్ కంపెనీ పై చర్యలు తీసుకొని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కౌన్సిల్ సబ్యులుఎండి షఫీద్దీన్, ఎం రమేష్, ఎం.రాధా లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్య పరిష్కరిస్తాం



నవతెలంగాణ-రామచంద్రాపురం

రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని సాయి జ్యోతినగర్ కాలనీలో గల డ్రయినేజీ సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని రామచంద్రాపురం కార్పొరేటర్ పుష్ప నగేష్ అన్నారు. మంగళవారం అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. అక్కడ ఉన్న సమస్యల గురించి కాలనీవాసులను అడిగి తెలుసుకున్నారు. డ్రయినేజీ సమస్య అధికంగా ఉన్నదని ఈ సందర్భంగా కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే అధికారులకు సమస్య పరిష్కరించాలని కార్పొరేటర్ ఆదేశించారు. అదేవిధంగా మంచినీటి సమస్య, వీధి దీపాలు మిగిలి ఉన్న సిసి రోడ్లు పనులను వెంటనే పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ గోవింద్, నాయకులు మల్లేష్, వెంకట్ రెడ్డి, రాజు, ప్రీతి, భూపాల్, నాయక్, శ్రీకాంత్, భారతి, సత్తయ్య యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కార్గో సేవలతో ప్రజలకు ఎంతో మేలు



నవతెలంగాణ-నర్సాపూర్

తెలంగాణ ప్రభుత్వం, ఆర్టీసీ ఎండి సజ్జనర్ తీసుకువచ్చిన కార్గో సేవల ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఆర్ఎం ఈ మారుతి అన్నారు. నర్సాపూర్ ఆర్టీసీ బస్టాండులో కార్గో సేవలను అందిస్తున్న బాపుచారితో కలిసి మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌లు మంగళవారం నర్సాపూర్ పట్టణంలోని ప్రతీ షాపు తిరుగుతూ ఆర్టీసీ అందిస్తున్న కార్గో సేవలను వివరించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఆర్ఎంఈ మారుతి మాట్లాడుతూ.. నర్సాపూర్ పట్టణంలోని ప్రతి వ్యాపారస్తులు తమ ఆర్టీసీ కార్గో సేవలను అందిపుచ్చుకొని తోడ్పాటును అందివాలన్నారు. కార్గో సేవలు వ్యాపారస్తులకు మంచి లాభదాయకంగా ఉంటాయన్నారు. డీఎంఈఎస్ ఆర్‌డి బస్వరాజ్, జీకే మొబైల్ ప్రతినిధి జ్ఞానేశ్వర్ తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ
మెదక్
బుధవారం 01 ఫిబ్రవరి 2023



నర్సాపూర్ పట్టణ మున్నూర్ కాపు సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షులుగా సంగసాని నర్సింగరావు, ఉపాధ్యకులుగా పిల్లి సదానంద్, బాదె శ్రీనివాస్, ఆకుల అర్జున్, ప్రధాన కార్యదర్శిగా పిల్లి గణేష్ కుమార్, సహాయ కార్యదర్శిలుగా కొండ శ్రీకాంత్, ఆకుల వెంకటేష్, కోశాధికారిగా పిల్లి వెంకట రమణ, కార్యదర్శిలుగా కల్లూరి వేంకటేష్, గుండం మల్లేష్, ఆకుల సుధాకర్, ముఖ్య సలహాదారులుగా ఆకుల శ్రీనివాస్, కల్లూరి ఆంజనేయులు, గాలి నర్సింలును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు జిల్లా ప్రధాన కార్యదర్శి గుండం శంకర్, జిల్లా కార్యదర్శి బాదే బాలరాజు, ఐదవ వార్డు కౌన్సిలర్ సంగసాని సురేష్, పిల్లి భూమేశ్, సంగసాని యదయ్య, చిన్న యదయ్య, లింగం, యువక మండలి సభ్యులలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు అంగన్వాడీల వినతి



నవతెలంగాణ-జోగిపేట

ఈనెల 3వ తేదీ నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో అంగన్వాడీల సమ స్యలపై చర్చించి.. వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని మంగళవారం అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్‌ను అంగన్వాడీ కార్యకర్తలు కోరారు. ఈ మేరకు సీఐటీయూ డివిజన్ కార్యదర్శి విద్యాసాగర్ ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. శాసనసభలో చర్చ జరిపి అంగన్వాడీల సమస్యల గురించి మాట్లాడాలని కోరారు. అంగ న్వాడీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీని ఇచ్చినట్లు ఆయ న తెలిపారు. జోగిపేట మున్సిపల్ చైర్మన్ గూడెం మల్లయ్య, అంగన్వాడి యూనియన్ నాయకురాలు అరుణ, ఇందిర, శోభారాణి, జ్యోతి, రమకల, పద్మ పాల్గొన్నారు.

వరి పంట పొలాలను సందర్శించిన ఏడిఏ



నవతెలంగాణ-చేగుంట

వరి పంటలో ప్రస్తుతం కాండం తొలుచు పురుగుఎక్కువగా ఆశించి పంట నష్టం కలగజేస్తుందని రామాయంపేట సహాయ వ్యవసాయ సంచాలకురాలు వసంత సుగుణ అన్నారు. చేగుంట మండలంలోని రుక్మాపూర్ గ్రామంలో వరి పొలాలను రామయంపేట్ సహాయ వ్యవసాయ సంచాలకులు వసంత సుగుణ, మండల వ్యవసాయ విస్తరణ అధికారులతో కలిసి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ యాసంగి సీజన్‌లో వరి పంటలో కాండం తొలుచు పురుగు ఎక్కువగా ఆశించి నష్టం కలుగ చేస్తుందన్నారు. ఈ సీజన్‌లో ఉధృతి ఎక్కువగా ఉన్నట్టు గమనించారన్నారు. మొగి పురుగు నివారణకు 10-20 రోజుల వరి పంటకు కార్బోఫ్యూరాన్ గుళికలు 3జీ, 10కిలోలు ఇసుకలో కలిపి చల్లుకోవాలని రైతులకు సూచించారు. 25 రోజులుపైన పంటకి కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్పీ 400 గ్రాములు, పురుగు ఉధృతి అధి కంగా ఉంటే క్లోరాన్ట్రనిలిప్రోల్ 60 మి.లీ లీటర్ల చొప్పున ఎకరానికి పిచికారి చేయాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారి అశోక్ రెడ్డి రైతులు కిష్ట రెడ్డి, బాల్ రాజ్, గాండ్ల ఆనందం ,సత్తయ్య ,స్వామి, తదితరులు పాల్గొన్నారు.

పోటీతత్వం అలవర్చుకుంటే ఆశించిన ఫలితాలు



నవతెలంగాణ-పెద్దశంకరంపేట

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకుంటే ఆశించిన ఫలితాలు సాధించవచ్చని తహసీల్దార్ చరణ్‌సింగ్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. విద్యార్థులు శ్రద్ధతో బాగా చదివి అన్ని రంగాల్లో బాగా రాణించి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ పాఠశాలలో సంస్కృతిక కార్యక్రమాలు, ఆటలపోటీలు నిర్వహించటం అభినంద నీయమన్నారు. ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ అవనీష్ రెడ్డి , సర్పంచ్ అలుగుల సత్యనారాయణ, ఆర్ఐ ప్రభాకర్, లెక్చరర్లు, తదితరులు పాల్గొన్నారు.

లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-రేగోడు

మండల కేంద్రమైన రేగోడులోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మంగళవారం బీఆర్ఎస్ మండల నాయకులు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సుంకే రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచిం చారు. తాసిల్దార్ లక్ష్మణ్, ఎస్సై సత్యనారాయణ, రేగోడు సర్పంచ్ నర్సింలు, ఎంపీ టీసీ నర్సింలు, బీఆర్ఎస్ రేగోడు గ్రామాధ్యక్షులు సుభాష్, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు రవీందర్, పీఏసీఎస్ చైర్మన్ రాజు యాదవ్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు కృష్ణమూర్తి యాదవ్, మాజీ సర్పంచ్ గోపాల కృష్ణ యాదవ్, తదితరులున్నారు.

ఉద్యోగి బదిలీ అయినా.. సేవలు చిరకాలం నిలిచిపోతాయి



నవతెలంగాణ-రామచంద్రాపురం

ఉద్యోగస్తులందరూ ఉద్యోగ విరమణ పొందడం సర్వసాధారణమేనని.. అయితే ఉద్యోగిగా ప్రజలకు చేసిన సేవ చిరకాలం నిలిచిపోతుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డి అన్నారు. భారతినగర్ డివిజన్ పరిధిలోని ఈఎస్ఐ ఆసుపత్రిలో విధులు నిర్వహిస్తున్న నరేందర్ ఉద్యోగ విరమణ కార్యక్రమం మంగళవారం ఆస్పత్రి ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమానికి గూడెం మధుసూదన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆస్పత్రి అభివృద్ధిలో నరేందర్ చేసిన సేవలను ఆయన కొనియాడారు. బీఆర్ఎస్ సర్కిల్ అధ్యక్షులు పరమేష్ యాదవ్, మాజీ కార్పొరేటర్ అంజయ్య యాదవ్, కృష్ణకాంత్, స్థానిక నాయకులు, పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహం కోసం లక్ష విరాళం



నవతెలంగాణ-మునిపల్లి

మండలంలోని కంకోల్ అంబేద్కర్ యువజన సంఘానికి నూతన అంబే ద్కర్ విగ్రహం కోసమని సంగారెడ్డి జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పులిమామిడి రాజు లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ విశ్వనాథం మాజీ సర్పంచ్ రాములు అంబేద్కర్ యువజన సంఘం గ్రామ శాఖ అధ్యక్షులు భూతపల్లి నర్సింలు, నర్సింలు తదితరులు పాల్గొన్నారు

వెంచర్లలో ఐటి అధికారుల సోదాలు



నవతెలంగాణ-రామచంద్రాపురం

తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రాజ్ పుష్పా ఎంపీరియా, ముప్పా, మరికొన్ని వెంచర్లలో మంగళ వారం ఐటీ శాఖ అధికారులు సోదాలు నిర్వహిం చారు. 5 వాహ నాలల్లో వచ్చి సోదాలు నిర్వహి స్తున్నారు. రాజ్ పుష్ప వెంచర్‌లోని ఎమ్మెల్సీ వెంకటరామిరెడ్డి నివాసంలో ఐటి దాడులు నిర్వహిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఐటీ దాడులు చేస్తున్న సమాచారం తెలుసుకున్న మీడియా సిబ్బంది రాజ్ పుష్ప వెంచర్ వద్దకు చేరుకో గానే లోపలికి అనుమతించకపోవడంతో విలేకరులందరూ గేటు బయట నిరీక్షించారు.

వంటగ్యాస్ వాడకంపై ప్రజలకు అవగాహన



నవతెలంగాణ-న్యాల్‌కల్

శ్రీ గురు ఇండియన్ గ్యాస్ యజమాని కే.భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని న్యాల్‌కల్, హద్నూర్, ముంగి, మలకలపాడు గ్రామాల ప్రజలకు గ్యాస్ వాడకంపై మంగళవారం అవగాహన కల్పించారు. గ్యాస్ వాడకుంటే రెగ్యులేటర్ ఎల్లవేళలా ఆఫ్ చేయాలని సూచించారు. ఎమైనా లీకేజీ ఉన్నట్టు గమనిస్తే వెంటనే డిస్ట్రిబ్యూటర్‌కు సమాచారం ఇవ్వాలని శ్రీ గురు ఇండియన్ గ్యాస్ మేనేజర్ ఎం.కుమార్ ఆయా గ్రామాల వినియోగదారులకు సూచించారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పథకాలు



నవతెలంగాణ-తూప్రాన్‌రూరల్, మనోహరాబాద్

రాష్ట్రంలోని ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను తీసుకొస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ రేఖల హేమలత శేఖర్ గౌడ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ దత్తత గ్రామమైన గౌతోజి గూడలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ.. ఒక్కరూ కంటి పరీక్ష చేపించుకోవాలన్నారు. దేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలల్లోనూ, అభివృద్ధి లోను దూసుకు వెళ్ళున్నదన్నారు. అనంతరం గౌతోజీ గూడెం ప్రాథమిక పాఠశాలను, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. జిల్లా పరిశ్రమల శాఖ అధికారి కృష్ణ మూర్తి, ఎంపీపీ పురం నవనీత రవి ఎంపీడీవో అరుంధతి, వైస్ ఎంపీపీ విఠల్ రెడ్డి, పార్టీ అధ్యక్షులు పురం మహేష్, పీహెచ్సి సుపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్, సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఉపసర్పంచ్, ఉప సర్పంచ్ల ఫోరం జిల్లా అధ్యక్షులు రేణు కుమార్, నాయకులు మంచ శ్రీరామ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలను కబ్జా చేసేందుకు కేంద్రం కుట్ర



నవతెలంగాణ-మెదక్‌టౌన్

సహకార సంఘాలను కబ్జా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతున్నదని.. 2022 బిల్లులో పొందు పరిచిన సవరణలే దీన్ని స్పష్టం చేస్తున్నాయని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ ఆరోపించారు. మెదక్ పట్టణంలోని కేవల్‌కిషన్ భవనంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి సర్దార్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కమిటీ ముద్రించిన చైతన్య సేద్యం మాసపత్రిక డైరీ 2023ను విడుదల చేశారు. అనంతరం శోభన్ మాట్లాడుతూ.. స్థానిక సహకార సంస్థలపై ఒత్తిడి తెచ్చి వాటిని ఇరుకున పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదన్నారు. సంస్థల విలీనాలు బోర్డులను స్వాధీనం చేసుకునేందుకు ప్రమాదకరమైన సవరణలు బిల్లులో ఉన్నాయన్నారు. రాష్ట్రాల పరిధిలో ఉన్న సహకార వ్యవస్థ పై కేంద్ర ప్రభుత్వ నియంత్రణ ఏమిటని ప్రశ్నించారు. రాజ్యాంగంలోని ఫెడరల్ వ్యవస్థను బలహీనపరచడం కోసం నరేంద్ర మోడీ ప్రభుత్వం ఈ మార్పులు చేస్తున్నదన్నారు. బహుళ రాష్ట్రాల సహకార సంఘంగా ఏర్పడేందుకు కార్పొరేట్ సహకార సంస్థలతో కేంద్ర ప్రభుత్వం చేతులు కలుపుతుందని అన్నారు. రాజకీయ జోక్యం వలన సహకార సంఘాలు మరింత బలహీన పడతాయని అన్నారు. భారతదేశం సహకార స్ఫూర్తి ప్రాంతీయ వైవిధ్యం పై ఆధారపడి ఉందని గుర్తు చేశారు. రాష్ట్రాల్లోని సహకార సంఘాలను సంక్షోభంలోకి నెట్టి వేశాయని గుర్తు చేశారు. 2022 బిల్లులో కేంద్ర సవరణల పేరుతో దెబ్బతీయడం నాశనం చేయడమే బిజెపి లక్ష్యంగా ఉన్నట్లు కనిపిస్తు ందన్నారు. రాజకీయంగా చట్టపరంగా రాష్ట్రాల పరిధిలో ఉన్న సహకార వ్యవస్థను దెబ్బతీయడం రాజ్యాంగ విరుద్ధ మైన చర్య అని దానిని తిప్పి కొట్టడానికి అందరూ ఐక్యం కావాలని కోరారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి చింతల గౌరీ, జిల్లా ఉపాధ్యక్షులు బాగయ్య, మధుసూదన్ రెడ్డి, నాయకులు అశోక్, సుధాకర్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సభలో వంద స్ట్రీట్ లైట్లకు తీర్మానం



నవతెలంగాణ-చేగుంట

అత్యవసర సీసీరోడ్లు, అండర్ డ్రైనేజీ మోరీలను ఏర్పాటుచేసి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూస్తామని, చేగుంట సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు మంచికట్ల శ్రీనివాస్ అన్నారు. చేగుంట పట్టణ కేంద్రం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ మంచికట్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చేగుంట పట్టణం అభివృద్ధి విషయంలో ముందంజలో ఉందని, మార్కెట్ కమిటీ ప్రహరీ గోడ ప్రక్కన 12 షెడ్లు, 50 వీధి స్తంభాలు ఎమర్జెన్సీ సీసీ రోడ్లు, సైడ్ డ్రైనేజీలు, పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని, గ్రామ సభలో తీర్మానం చేయడం జరిగిందన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ.. రెండో విడత కంటి వెలుగు మార్చి 8వ తేదీ నుండి, ఏప్రిల్ 12వ తేదీ వరకు కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించబడుతుందని, వైద్య పరంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అందుబాటులో ఉంది వైద్య సేవలు అందిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి రాణి, ఉపసర్పంచ్ సురేఖ ,గ్రామ వార్డు సభ్యులు రవి, మహేష్, జయరాములు, సంతోష్, అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, అమాలి సంఘం అధ్యక్షులు సోమ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం వచ్చే బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వ విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని ప్రభుత్వ విద్య బలోపేత కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం శాంతినగర్‌లోని ఉపాధ్యాయ భవన్‌లో ఎన్నార్ అధ్యక్షతన ఆ కమిటీ సభ్యులు ప్రెస్‌మీట్ నిర్వహించి మాట్లాడారు. గత ఎనిమిదేండ్లుగా ప్రభుత్వ విద్యారంగం అనేక సమస్యలతో, నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్నదన్నారు. కాగా హాజరైన వివిధ సంఘాల నాయకులు 30శాతం నిధులు కేటాయించాలన్న డిమాండ్‌కు సంపూర్ణ మద్దతునిచ్చారు. స్థానిక ఎమ్మెల్యే, ఆర్థిక మంత్రి హరీశ్‌రావులను నేడు(బుధవారం) కలవాలని ఈ కమిటీలో తీర్మానించారు. ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ కమిటీ దుర్గ ప్రసాద్, ఎమ్మార్పీఎస్ చిరంజీవి, బహుజనసేన అనిల్ బౌద్ధ, స్వేరోస్ సురేష్, ఏఐఎస్ఎస్‌డి బసవరాజ్, టీఎస్ఎఫ్ వేణుగోపాల్, తెలంగాణ రక్షణ సమితి పోలీస్ రాంచందర్, జై భారత్ ఇమ్మయ్య మార్పు కళా మండలి గణేష్, జిల్లా నాయకులు అబ్దుల్ సమద్, ఎస్ఎఫ్ఐ మహేష్, బిఎస్ ఎఫ్ సాయికుమార్, రిటైర్డ్ జిహెచ్ఎం విజయరావ్, బీఎస్పీ నాయకులు నటరాజ్ మోహన్, జి.మల్లయ్య పాల్గొన్నారు.

గిరిజన బాలికల కళాశాలలో వైద్య పరీక్షలు



నవతెలంగాణ-కల్హేర్

మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని స్థానిక తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అప్గ్రేడ్ రెసిడెన్షియల్ బాలికల జూనియర్ కళాశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి పరిశుభ్రత పై అవగాహన కల్పించినట్లు సిర్గాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి విజయ్ కుమార్ తెలిపారు. రెండు మూడ్రోజులుగా విద్యార్థులకు జలుబు, దగ్గు, జ్వరం వంటి అనారోగ్య సమస్యలు వస్తుండడంతో.. ప్రిన్సిపల్, వార్డెన్‌లు వైద్య సిబ్బందికి సమాచారం అందించారు. దీంతో మంగళవారం మండల వైద్యాధికారి డాక్టర్ విజయ్ కుమార్ సిబ్బందితో పాఠశాలలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చేతుల శుభ్రత, వ్యక్తిగత శుభ్రత, అంటు వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఎవరికైనా ఒళ్ళు నొప్పులు, జలుబు, దగ్గు, టైఫాయిడ్, మలేరియా జ్వరాలు వంటి లక్షణాలు ఉంటే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం స్కూల్లోని డార్మెంటరీ వసతిగృహాలను భోజనశాలను వాటర్ ట్యాంకులను తిరిగి పరిశీలించారు. వారానికి ఒక్కసారి వాటర్ ట్యాంకులు కడిగించాలని క్లోరినేషన్ చేయాలని ప్రిన్సిపాల్‌కు తెలిపారు. పిహెచ్ఎన్ నిర్మల, మండల హెల్త్ సూపర్వైజర్ సుగుణ, కళాశాల ప్రిన్సిపల్ శ్యామల దేవి, ఏఎన్ఎంలు సురేఖ, కళాశాల స్టాఫ్ నర్స్ శ్రావణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువతరం దేశానికి గొప్ప వరం



నవతెలంగాణ-జిన్నారం

భారతదేశ యువతరం దేశానికి గొప్ప వరమని జిన్నారం మండల పరిషత్ అధ్యక్షులు దమ్మగోని రవీందర్ గౌడ్ అభివర్ణించారు. జిన్నారం మండలం సోలక్‌పల్లిలోని స్థానిక క్రీడా మైదానంలో తనసొంత నిధులతో క్రీడాకారుల సౌకర్యార్థం మంగళవారం బోర్ వేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. భారతదేశంలో యువతకు కొదవలేదని రాబోయే రోజుల్లో భారతదేశ యువశక్తి ప్రపంచంలోనే అద్భుతాలు సృష్టిస్తూ అమోఘమైన మేధాసంపత్తితో జగతికి దిశా నిర్దేశం చేస్తుందన్నారు. యువతరానికి చేయూత ఇవ్వడానికి ప్రతి ఒక్కరు ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. స్థానిక క్రీడా మైదానం అభివృద్ధి క్రీడాకారులకు కావలసిన సదుపాయాల కల్పనలో సోలక్ పల్లి సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి ఎప్పటికప్పుడు స్పందిస్తుండడం అభినందనీయమన్నారు. వైస్ ఎంపీపీ గంగు రమేష్, స్థానిక సర్పంచ్ దాసరి శ్రీకాంత్ రెడ్డి, కృష్ణారెడ్డి, వార్డు సభ్యులు జగన్ రెడ్డి,నాయకులు భాస్కర్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, జంగారెడ్డి, నర్సింగరావు, సాయిలు, గంగురాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బీవీఆర్ఐటి ఆధ్వర్యంలో ఐఓటి పరికరాలపై అవగాహన



నవతెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ఐటి కళాశాలకు డిపార్ట్మెంట్ సైన్స్అండ్ టెక్నాలజీ, మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుంచి ఐఓటి ప్రాజెక్టు మంజూరు అయింది. కాగా మంగళవారం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాలలో ఐవోటి పరికరాలపై అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీవీఆర్ఐటి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంజయ్ దోబి హాజరై ఐఓటి పరికరాల ముఖ్య ఉద్దేశం గురించి క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. బివిఆర్ ఐటి కళాశాల నుండి వచ్చిన 30 మంది విద్యార్థినీ విద్యార్థులు బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాలలోని 200 మంది విద్యార్థిని విద్యార్థులకు ఐవోటి పరికరాలపై అవగాహన కల్పించడంతోపాటు నిత్యజీవితంలో ఇంటర్నెట్ యొక్క ఉపయోగం గురించి వివరించారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు జత్య, బీవీఆర్ఐటి కళాశాల ఇన్వెస్టిగేషన్ డాక్టర్ దశరథ రామయ్య, కో ఇన్వెస్టిగేషన్ డాక్టర్ భీమా, బీవీఆర్ఐటి కళాశాల అధ్యాపకులు అమరేందర్ రెడ్డి,రాకేష్, బిక్షపతి,స్నేహ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ కార్మికులకు జీ.ఓ 11 అమలు చేయాలి



నవతెలంగాణ-మెదక్‌టౌన్

మిషన్ భగీరథ కార్మికులకు జీ.ఓ నెంబర్ 11ను అమలు చేయాలని మిషన్ భగీరథ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఏ.మహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మిషన్ భగీరథ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ దినేష్‌కుమార్‌కు మిషన్ భగీరథ కార్మికుల సమస్యలపై మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. మెదక్ జిల్లాలో సుమారుగా 200, 300 మంది మిషన్ భగీరథ కార్మికులుగా పని చేస్తున్నారని.. వారితో వెట్టి చాకరి చేయించుకుంటూ కనీస వేతనం అమలు చేయట్లేదని ఆరోపించారు. అంతేకాకుండా ఈఎస్ఐ, పిఎఫ్ ఇతర సదుపాయాలు కల్పించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టులపై చర్యలు తీసుకోవాల్సిన ఉన్నతాధికారులు కాంట్రాక్టు దగ్గర కమీషన్లు తీసుకొని నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని ఆరోపించారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి లేదా కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఉద్యోగ భద్రతతో పాటు 20శాతం బోనస్ రక్షణ పరికరాలు, గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని కోరారు. లైన్మెన్‌కు తక్షణమే ట్రావెల్ అలవెన్సులు చెల్లించాలని.. లేదా నిబంధనల ప్రకారం 15 కిలోమీటర్లకు ఒక్కరు చొప్పున లైన్మెన్‌ను నియమించాలని కోరారు. వేతనాలు సకాలంలో చెల్లించని కంపెనీలను బ్లాక్ లిస్టులో ఉంచాలి, బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 60 లేదా జీవో నెంబర్ 11 అమలు చేయాలన్నారు. కంపెనీలు కాకుండా మిషన్ భగీరథ స్కీం నుండి నేరుగా జీతభత్యాలు కార్మికులకు చెల్లించాలని అన్నారు. 8 గంటల పని దినములు అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాబయ్య, బాలు, సంతోష్, రాజు,ప్రవీణ్, మాణిక్యం, గోపి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీ శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు



నవతెలంగాణ-చేగుంట

మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో వెలసిన అతి పురాతన స్వయంభు శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ ధర్మకర్త శ్రీ గోల్కొండ కృష్ణవేణి దేశ్ముక్, కిషన్‌రావు దేశ్ముక్ ఆధ్వర్యంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో వారం రోజులపాటు స్వామి వారికి ఊరేగింపు, కలశపూజ ,అభిషేకం, స్వామివారి కళ్యాణం, అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త గోల్కొండ కిషన్‌రావు దేశ్ముఖ్ మాట్లాడుతూ.. ప్రతీయేడాది జనవరి చివరి మాసంలో జరిగే స్వామివారి బ్రహ్మోత్స వాలకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారన్నారు. బ్రహ్మోత్సవాల్లో స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథోత్సవం ఊరేగింపు, భాజాభజంత్రీల మధ్య కనుల పండుగ నిర్వహించారు. కల్యాణోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. సర్పంచ్ రాములు, సత్యనారాయణ, మాసాయిపేట సర్పంచ్ మధుసూదన్ రెడ్డి, వార్డు సభ్యులు కుమ్మరి, విఠల్, చిట్రాజిపల్లి బిక్షపతి, లక్ష్మి నరసయ్య, వడ్ల రాజు, ఇబ్రహీంపూర్ గ్రామ ప్రజలు వివిధ గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

మిషన్ భగీరథ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఎస్ఈ ఆఫీస్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అనంతరం ఎస్ఈకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు మాట్లాడుతూ.. మిషన్ భగీరథలలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనాలు, చట్టపరమైన సౌకర్యాలు అమలు కావడం లేదన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఈఎస్ఐ, పిఎఫ్ గుర్తింపు కార్డులు, ఇన్సూరెన్స్ ఇతర సౌకర్యాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఇంటింటికి తాగు నీటిని సప్లయి చేస్తున్న కార్మికులకు అరకొరా వేతనాలు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్కొక్క కాంట్రాక్టర్ ఒక్కో విధంగా వేతనాలు చెల్లిస్తున్నారని.. అయినప్పటికీ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రూ.7,500 నుండి 10000 వరకు మాత్రమే చెల్లిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీస వేతనం చెల్లించాలని, బకాయి వేతనాలు చెల్లించాలని చట్టపరమైన సౌకర్యలు వెంటనే అమలు చేయాలని.. లేని యెడల ఎస్ఈ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించారు. యూనియన్ అధ్యక్షులు సుధాకర్, కృష్ణ, వెంకటేష్, నర్సింలు, బిచ్చయ్య, సుదర్శన్, సిద్ధప్ప, మిషన్ భగీరథ కార్మికులు పాల్గొన్నారు.

6, 7 తేదీల్లో వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులు



నవతెలంగాణ-జహీరాబాద్

విద్యార్థుల్లో నైపుణ్యాన్ని పెంపొందించేందుకుగాను గంప నాగేశ్వరరావు బృందంతో పస్తాపూర్ చౌరస్తా వద్ద గల ఆర్ఎల్ కన్వెన్షన్‌లో ఈనెల 6, 7 తేదీల్లో వ్యక్తిత్వ వికాస శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మారుతీ రావు, నారాయణ, అన్వేష్, వంశీ తెలిపారు. స్థానిక వాసవి డిగ్రీ కళాశాలలో మంగళశారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. రెండ్రోజుల పాటు ఉచితంగా ఈ తరగతులను ఇప్పిస్తున్నామన్నారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు కూడా శిక్షణ ఇప్పించేందుకు వివిధ రంగాల్లో నిపుణులు అయిన 12 మంది ట్రైనర్స్ వస్తున్నారన్నారు. ఈ అవకాశాన్ని జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్, పీజీ కళాశాలల విద్యార్థులు వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సోమవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిరంతరంగా తరగతులు కొనసాగుతాయన్నారు. శిక్షణ తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు కూడా భోజన సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ సదావకాశాన్ని ప్రతీ ఒక్క విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. భాస్కర్ యాదవ్, ఏజీపీ శ్రీనివాసరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దీశెట్టి, పార్టీ శివశంకర్, అనంత నవీన్ కుమార్‌లు కూడా నిర్వాహక కమిటీ బృందం సభ్యులుగా ఉన్నారని తెలిపారు.

నిజాయితీగా పని చేస్తే నిందలా?

- నాపై తప్పుడు ఆరోపణలు సరికాదు
- శివంపేట గ్రామ కార్యదర్శి స్వప్న



నవతెలంగాణ-పుల్కల్

గ్రామాభివృద్ధి కోసం నిజాయితీగా పనిచేస్తున్న తనపై తప్పుడు ఆరోపణలు చేయడమే కాకుండా.. అవినీతికి పాల్పడుతున్నానంటూ డీపీఓకు పలువురు ఫిర్యాదు చేయడాన్ని శివంపేట గ్రామ కార్యదర్శి స్వప్న ఖండించారు. నిజంగా అవినీతి చేసి ఉంటే ఆధారాలతో నిరూపించాలని సవాల్ విసిరారు. ఈ సందర్భంగా మంగళవారం ఆమె విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడారు. శివంపేటలో నిర్మి స్తున్న నూతన గృహాలకు అనుమతి కోసం తాను ఏ ఒక్కరి వద్ద ఒక్క రూపాయి కూడా లంచం తీసుకోలేద న్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే అనుమతికి సంబంధించిన రుసుం తీసుకున్నామని.. దానికి సంబంధించిన రసీదులను కూడా ఇచ్చానన్నారు. కొందరు గ్రామస్తులు ఎక్కువ స్థలంలో ఇండ్లు నిర్మించి తక్కువ స్థలంలో నిర్మించినట్టు అనుమతులు కావాలని తమ వద్దకు వస్తే.. ఎంత విస్తీర్ణంలో నిర్మించారో చూసి దాన్ని కొలతలు చేసి నాలా నిబంధనల ప్రకారం అనుమతులు తీసుకోవాలని చెప్పానన్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా గ్రామంలో నూతన గృహాలు నిర్మిస్తున్న వారిపై పలుమార్లు నోటీసులను కూడా ఇచ్చామన్నారు. దాంతో తనపై కక్షకట్టి తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. గ్రామాభివృద్ధి కోసం అనునిత్యం కృషి చేస్తున్నామన్నారు. తనపై వచ్చిన ఆరోపణలను పూర్తి ఆధారాలతో సహా నిరూపించాలన్నారు. అంతేకాకుండా సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ఎల్లవేళలా గ్రామాభివృద్ధికి సహకరిస్తున్నారన్నారు. అయితే కొందరు కావాలనే ఈ ఆరోపణల్లో వారి పేర్లను ప్రస్తావించడం సిగ్గు చేటన్నారు. సర్పంచ్ రాజిరెడ్డి ఉపసర్పంచ్ నత్తి దశరథ్ వీరు తమకు పూర్తి ఆరోపణలు మానుకుని ప్రతీ ఒక్కరూ అభివృద్ధికి సహకరించాలని కోరారు.



ఫిజియోథెరపిస్ట్ శ్రీకాంత్ కుమార్‌కు వైద్య సేవారత్న అవార్డు



నవ తెలంగాణ - సిద్దిపేట

వైద్య సేవలకు గుర్తింపుగా ఫిజియోథెరపిస్ట్ డా. శ్రీకాంత్ కుమార్‌కు వైద్య సేవారత్న అవార్డు దక్కింది. హైదరాబాద్ ఎల్డర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్, తెలంగాణ ఫిజియోథెరపిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఫిజియోథెరపీ వేడుకల్లో డా. శ్రీకాంత్ కుమార్ కి ఆంధ్రప్రదేశ్ విశ్రాంత న్యాయ మూర్తి జస్టిస్ రజనీ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా డా. శ్రీకాంత్ కుమార్ మాట్లాడుతూ..ఫిజియోథెరపిస్ట్ గా అందించిన సేవలకు అవార్డు దక్కడం ఆనందంగా ఉందన్నారు. అవార్డు తో బాధ్యత పెరిగిందని, ఉత్తమ వైద్య సేవలే లక్ష్యంగా పని చేస్తానని అన్నారు.

నిరుపేద కుటుంబాలకు బియ్యం పంపిణీ



నవతెలంగాణ-తొగుట

నిరుపేద కుటుంబాలకు బియ్యం పంపిణీ చేశామని మాజీ ఎంపీటీసీ సుతారి రమేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో గుండె పోటుతో మరణించిన రామోల్ల కరుణాకర్, అనారోగ్యంతో మరణించిన కుమ్మరి సత్తవ్వ ల ఇరు కుటుంబాలకు 50 కేజీల చొప్పున బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి కి నిరుపేద కుటుంబాలకు చెందిన ఇద్దరు గుండె పోటుతో, అనారోగ్యంతో వృద్ధురాలు మృతి చెందిన విష యం తెలియజేశానని అన్నారు.వెంటనే స్పందిం చిన వైస్ ఎంపీపీ ఒక్కొక్క కుటుంబానికి 50 కీలల బియ్యాన్ని అందించుమని తెలినట్లు చెప్పారు. వారికి బియ్యం అందించామని అన్నారు. చిలువేరు శ్రీనివాస్ గౌడ్, రామోల్ల అనీల, అరుణ్, మహేష్, ఆంజనేయులు, బాలయ్య పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కు పంపిణీ



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండల కేంద్రంలో పెరుమణి లక్ష్మీ కుటుంబానికి మంగళవారం కల్యాణలక్ష్మి చెక్కును పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ దిలీప్ నాయక్, నంగునూరు మండల మాజీ ఎంపీటీసీల పోరం అధ్యక్షుడు చౌడుచర్ల జయపాల్ రెడ్డి,నంగునూరు గ్రామ బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ఉల్లి మల్లయ్య, బీఆర్ఎస్ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బాల పోచయ్య, బీఆర్ఎస్ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి దేవులపల్లి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

బాధ్యత కుటుంబాన్ని పరామర్శించిన సర్పంచ్ శ్రీనివాస్



నవ తెలంగాణ మిరు దొడ్డి

ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి కుటుంబాన్ని సర్పంచ్ శ్రీనివాస్ పరామర్శించారు. మంగళవారం అక్బర్పేట భూంపల్లి మండలం మోతే గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన గెగ్గే పోచయ్య మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని బాధిత కుటుంబానికి సర్పంచ్ కాలేరు శ్రీనివాస్ వారి కుటుంబాన్ని పరామర్శించి, 50 కిలోల బియ్యాన్ని అందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మానస రంజిత్ ,బిఆర్ఎస్ మండల%ంష% సెల్ అధ్యక్షులు బోరేము రాజేశ్వర్ ,వార్డ్ మెంబర్ మాయేస చంద్రము టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కమ్మ రవికుమార్ సిద్ధమైన రమేష్ అల్వాల బిక్షపతి దుర్గేష్ తదితరులు పాల్గొన్నారు

హైనా దాడిలో గేదె మృతి

నవతెలంగాణ-చేర్యాల



మండల పరిధిలోని వీర న్నపేట గ్రామ శివారులో గత రెండు రోజుల క్రితం హైనా దాడిలో గేదె మృతి చెందిన విషయం తెలిసిందే. ముస్త్యాల గ్రామానికి చెందిన కేశిరెడ్డి ప్రణీత్ రెడ్డి అనే రైతు తన వ్యవసాయ బావి వద్ద పశువుల పాకలో కట్టేన గేదెపై సోమవారం రాత్రి హైనా దాడి చేసి చంపినట్లు బాధిత రైతు తెలిపాడు. రెండు రోజులుగా గేదెలపై హైనా దాడులు చేసి చంపేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోకపోవడం పట్ల రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి చర్యలు చేపట్టి గేదేలపై హైనా దాడులు జరగకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. వేలల్లో ఖర్చులు చేసి పెంచుకుంటున్న గేదెలను చంపుతుండడంతో రైతులు భయందోళనకు గురవుతున్నారు.

నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జీవన్ కుమార్

నవ తెలంగాణ - సిద్దిపేట

స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా డాక్టర్ జి జీవన్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఫలక్ నూమా డిగ్రీ కళాశాల నుండి పదోన్నతిపై వచ్చిన జీవన్ కుమార్‌కు కళాశాల ప్రస్తుత ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్ డాక్టర్ బి సీతారాములు బాధ్యతలు అప్పగించారు. డాక్టర్ జీవన్ కుమార్ గతంలో వరంగల్, జనగామ, హైదరాబాద్ డిగ్రీ కళాశాలలలో పనిచేసి సుదీర్ఘ అనుభవంతో పదోన్నతి పై మహిళా కళాశాలకు ప్రిన్సిపల్ గా రావడం పట్ల కళాశాల అధ్యాపక బృందం డాక్టర్ స్రవంతి, డాక్టర్ సువర్ణాదేవి, జ్యోతి, హరిప్రసాద్, కిషోర్, రవికుమార్ లు స్వాగతం పలికి, హర్షం వ్యక్తం చేశారు.

నెమలిని రక్షించిన యువకులు



నవతెలంగాణ-వర్గల్

మండలంలోని సింగాయపల్లి గ్రామ అడవి సమీపంలో నెమలి అనారోగ్యంతో అవస్థపడుతుంటే స్థానిక యువకులు గమనించారు. వెంటనే మండల పశువైద్య అధికారిని డాక్టర్ సృజనను కలిసి నెమలికి వైద్యం చేయించి స్వస్థత చేకూర్చారు. అంతరం నెమలిని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ వెంకన్నకు అప్పగించారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నెమలిని రక్షించడంతో యువకులను డాక్టర్ ని అటవీ అధికారులు అభినందించారు.

బీజేపీ మండల కమిటీలో ఉప సర్పంచ్‌లకు అవకాశం

నవ తెలంగాణ-దౌల్తాబాద్



దుబ్బాకలో మంగళవారం ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్ రావు సమక్షంలో నూతన కమిటీలను నియమించారు. సూరంపల్లి ఉప సర్పంచ్ బొల్లం స్వామి, ముబారస్ పూర్ ఉప సర్పంచ్ కనుగుల స్వామి లను బీజేపీ మండల ఉపాధ్యక్షులుగా నియమించారు. బీజేపీ మండల అధ్యక్షుడు పోతరాజు కిషన్ అన్నారు . ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కుమ్మరి నర్సింలు జిల్లా అధికార ప్రతినిధి యాదగిరి దౌల్తాబాద్ తాజా మాజీ జెడ్పిటిసి వీరమని భూపాల్ రెడ్డి, సర్పంచ్ బండి రాజు, సీనియర్ నాయకులు ముత్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

100 లక్ష్యం 36తో సరి..



- నేడు జిల్లాలో 36 మన ఊరు మనబడి పాఠశాలలను ప్రారంభించనున్న మంత్రి, అధికారులు, ప్రజాప్రతినిధులు

నవ తెలంగాణ - సిద్దిపేట

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మనబడి పథకం కింద జనవరి 2న జిల్లాలో 100 పాఠశాలలను ప్రారంభించాలని గత జెడ్పీ సర్వసభ్య సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు అధికారులను ఆదేశించారు. 36 పాఠశాలలు మాత్రమే సిద్ధం కావడంతో వాటిని ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు, ప్రజాప్రతినిధులు, అధికారులు ఈ నెల 1న ప్రారంభించడానికి విద్యాశాఖ అధికారులు సిద్ధం చేశారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా, అన్ని హంగులతో , బడుగు , బలహీన వర్గాలకు విద్యను అందించడానికి ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందించదగ్గ విషయమేనని విద్యావేత్తలు అంటున్నారు.

జిల్లాలో ఎంపికైన పాఠశాలలు

జిల్లాలో 900 కు పైగా ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో మొదటి ఫేజు కింద 343 పాఠశాలలను మన ఊరు మనబడి పథకానికి ఎంపిక చేశారు. కానీ 2 పాఠశాలలో వివిధ కారణాల చేత పనులు ప్రారంభం కాలేదు. 341 పాఠశాలలో పనులు ప్రారంభమై వివిధ దశలలో ఉన్నాయి. 341 పాఠశాలల్లో 36 పాఠశాలల్లో పనులన్నీ పూర్తి చేసుకుని ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాయి.

మన ఊరు మనబడి పనులు

ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో అన్ని వసతులతో, మంచి వాతావరణంలో విద్యను బోధించడానికి మన ఊరు మనబడి పథకాన్ని తీసుకువచ్చింది. జిల్లాకు మొదటి పేజులో 343 పాఠశాలలకు రూ 124 కోట్లు కేటాయించింది. రాష్ట్ర ప్రభుత్వం 84 కోట్లు, ఈజీఎస్ కింద 40 కోట్లు ఖర్చు పెట్టడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటివరకు జిల్లాకు 15 కోట్ల రూపాయల నిధులు విడుదలయ్యాయి. ప్రతి ఎంపికైన పాఠశాలలో మంచినీటి వసతి, ఎలక్ట్రిసిటీ, మేజర్ మైనర్ (కిటికీలు, డోర్లు, స్లాప్, ఫ్లోర్) రిపేర్లు, అదనపు తరగతి గదులు, డైనింగ్ హాల్, టాయిలెట్స్, కిచెన్ షెడ్, కాంపౌండ్ వాల్, రంగులు వేయడం వంటి పనులను చేస్తారు. ప్రాథమిక పాఠశాలలో ఎన్ఆర్ఈజీఎస్ కిందా చేసే పనుల్లో మరుగుదొడ్లు, కిచెన్ షెడ్, ప్రహరీ నిర్మాణం చేస్తారు.

నేడు ప్రారంభించుకొనున్న పాఠశాలలు

మొదటి దశలో బుధవారం 36 పాఠశాలలను ప్రారంభించనున్నారు. అక్కన్నపేట మండలంలోని ఎంపీపీఎస్ అంతక్కపేట, గోవర్ధనగిరి, బెజ్జంకి మండలంలోని ఎంపీపీఎస్ గుండారం, చిన్నకోడూరు మండలంలోని ఎంపీపీఎస్ అల్లీపూర్, దుబ్బాక మండలంలోని ఎంపీయుపీఎస్ పద్మనాభునిపల్లి, గజ్వేల్ మండలంలోని ఎంపీయుపీఎస్ కోల్గూర్, ఎంపీపీ ఎస్ పిడిచెడు, బెజగాన్, జాలిగాన్, హుస్నాబాద్ మండలంలోని ఎంపీపీ ఎస్ హుస్నాబాద్, కూచనపల్లి, జగదేవ్‌పూర్ మండలంలో ఎంపీపీ ఎస్ ఇటిక్యాల, కోహెడ మండలంలో జెడ్ పి హెచ్ ఎస్ బస్వాపూర్, ఎంపీపీ ఎస్ బీసీ కాలనీ (కోహెడ), కొండపాక మండలంలో ఎంపీపీ ఎస్ దుద్దెడ, కుకునూరు పల్లి, ఎంపీ యుపిఎస్ వెలికట్ట, మర్కుక్ మండలంలో ఎంపీపీ ఎస్ చెబర్తీ, ఎంపియుపిఎస్ వర్ధరాజ్‌పూర్, మిరుదొడ్డి మండలంలో జెడ్ పి హెచ్ ఎస్ బాలికలు మిరు దొడ్డి, ఎంపీపీఎస్ రుద్రారం, జెడ్ పి హెచ్ ఎస్ బాలికలు మిరుదొడ్డి, ములుగు మండలం లో ఎంపీపీ ఎస్ కొక్కొండ, నంగునూరు మండలంలో జడ్పీహెచ్ఎస్ రాజగోపాలపేట, సిద్దిపేట రూరల్ మండలంలో ఎంపీపీఎస్ రాఘవాపూర్, ఇర్కోడ్, జడ్పీ హెచ్ఎస్ రాఘవాపూర్, సిద్దిపేట అర్బన్ మండలంలో ప్రభుత్వ గర్ల్స్ పిఎస్ పాఠశాల, ప్రభుత్వ నం.1 శరవేశ్వర దేవాలయం, ప్రభుత్వ హెచ్ఎస్ పారిపల్లి స్ట్రీట్, ప్రభుత్వ హైస్కూల్ సిద్దిపేట, ఎంపీపీ ఎస్ హనుమాన్ నగర్, ఇందిరానగర్, తొగుట మండలంలో ఎంపీపీ ఎస్ ఘణపురం, వర్గల్ మండలంలో ఎంపీపీ ఎస్ వర్గల్, ఎంపీ యుపిఎస్ గుంటిపల్లి పాఠశాలలు ప్రారంభించడానికి సిద్ధంగా ఉన్నాయి.

నవతెలంగాణ-మర్కుక్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా మండలంలో 8 పాఠశాలలు ఎంపికయ్యాయి. బుధవారం మండలంలోని చేబర్తి ప్రాథమిక పాఠశాల, వర్ధరాజ్ పూర్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లను చేశారు.

పాఠశాలలకు రాని బెంచీలు, బోర్డులు

మన ఊరు-మన బడి కార్యక్రమంలో భాగంగా పాఠశాలకు రంగులు, మూత్రశాలలు, బోర్డులు, బెంచీలు, మంచి నీటి సౌకర్యం, విద్యుత్, వంట గది, వివిధ మౌలిక సదుపాయాల కల్పించాలి. ఇవేమీ పట్టనట్లుగా పాఠశాలలకు బోర్డులు, బెంచీలను తీసుకరాకపోటం, సంబంధిత అధికారులు నామమాత్రంగా ఏర్పాట్లు చేయటం గమనార్హం.





నవ తెలంగాణ-దుబ్బాక: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు - మనబడి కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో దుబ్బాక మండల వ్యాప్తంగా 25 పాఠశాలలు ఎంపికయ్యాయి. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని 11 పాఠశాలలు... చెల్లాపూర్ వార్డులో ఎంపీపీఎస్, ధర్మాజీపేట వార్డులో ఎంపీపీఎస్, జెడ్పీహెచ్ఎస్, దుబ్బాక పట్టణ కేంద్రంలోని ఎంపీపీఎస్ నెంబర్ వన్, ఎంపీపీఎస్-గర్ల్స్, ఎంపీపీఎస్-హెచ్/డబ్ల్యు.జి హెచ్ఎస్, జెడ్పీహెచ్ఎస్ గర్ల్స్, దుంపలపల్లి వార్డులో ఎంపీపీఎస్, జెడ్పిహెచ్ఎస్, లచ్చపేట వార్డులో ఎంపీపీఎస్ ఎంపికయ్యాయి.

రూరల్ పరిధిలో 14 పాఠశాలలు

అచ్చుమాయిపల్లి ఎంపీయూపీఎస్, ఆకారంలో ఎంపీపీఎస్, జెడ్పీహెచ్ఎస్, అప్పనపల్లి ఎంపీయూపీఎస్, చీకోడ్ ఎంపీపీఎస్, గంభీర్ పూర్ జడ్పీహెచ్ఎస్, హబ్సీపూర్ ఎంపీపీఎస్, పద్మనాభునిపల్లి ఎంపీయుపిఎస్ ,పెద్దగుండవెల్లి ఎంపీపీఎస్, పోతారం ఎంపీపీఎస్, పోతారెడ్డి పేటలో ఎంపీపీఎస్, జెడ్పిహెచ్ఎస్, రఘోత్తంపల్లి ఎంపీయూపీఎస్, తిమ్మాపూర్ ఎంపీపీఎస్ ఎంపికయ్యాయి.

మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ వివరణ

మన ఊరు మనబడి ద్వారా ఎంపికైన పాఠశాలల్లో పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని దుబ్బాక మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ తెలిపారు. దుబ్బాక మండల వ్యాప్తంగా మొత్తం 25 పాఠశాలలు ఎంపికయ్యాయని, మున్సిపల్ పరిధిలో 11, రూరల్ పరిధిలో 14 పాఠశాలల్లో మన ఊరు-మనబడి పనులు కొనసాగుతున్నాయన్నారు. 25 పాఠశాలల్లో చేపట్టిన పనులు దాదాపు చివరి దశకు చేరుకున్నాయన్నారు. హబ్సీపూర్ ఎంపీపీఎస్ తో పాటు కొన్నిచోట్ల కాంట్రాక్టర్లు, ప్రజా ప్రతినిధుల సమన్వయ లేమితో పనులు నత్తనడకన సాగుతున్నాయని చెప్పారు. ఎంపీపీ,జడ్పిటిసి,ఎంపీడీవో, స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో పనుల్లో వేగం పెంచేలా కృషి చేస్తున్నామన్నారు. ఫిబ్రవరి 1న పద్మనాభునిపల్లిలో ఎంపీయుపిఎస్ పాఠశాలను ప్రారంభానికి సిద్ధం చేశామన్నారు. అసంపూర్తిగా, మందకొడిగా సాగుతున్న పనులపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి సకాలంలో పనులు పూర్తయ్యేలా కృషి చేస్తామన్నారు.

నవతెలంగాణ కొండపాక : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మన ఊరు మనబడి కార్యక్రమంలో పూర్తిగా పనులు జరిగిన మూడు పాఠశాలలను బుధవారం ప్రారంభించనున్నారు. కొండపాక, కుకునూరుపల్లి మండలాల్లోని కుకునూరుపల్లి ,దుద్దెడ, వెలికట్ట గ్రామాల్లో గల ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం నిబంధనల మేరకు అన్ని సౌకర్యాలను కల్పించారు. విద్యార్థులకు అనుగుణంగా అదనపు గదుల నిర్మాణం, పాఠశాలలో విద్యుదీకరణ, టాయిలెట్ల నిర్మాణం, భవనాలకు కలర్లు, కిచెన్ షెడ్ల నిర్మాణం జరిగాయి. పూర్తిగా పనులు జరిగిన ఈ మూడు పాఠశాలల్లో విద్యార్థులకు డ్యూయల్ డిస్కులు పంపిణీ అయ్యాయి. వీటిని అధికారులు బుధవారం ప్రారంభించనున్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి : గతంలో అధ్వానస్థిలో ఉన్న పాఠశాలలు నేడు మన ఊరు-మన బడితో అమోగంగా మారతున్నాయి.



విద్యార్థులకు మేరుగైన విద్యతో పాటు మౌలిక వసతులు కల్పించి కార్పోరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలనే గొప్ప సంకల్పంతో మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వార ప్రత్యేక నిధులు కేటాయించి నిర్మాణ పనులకు నాంధి పలికింది తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం.మండలంలో 12 ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు సుమారు రూ.5 కోట్ల నిధులు మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వార మంజూరయ్యాయి.మొదటి విడతగా గుండారం, రేగులపల్లి, కల్లేపల్లి, బేగంపేట, గుగ్గిల్ల, బెజ్జంకి గ్రామాల్లోని పాఠశాలల్లో మన ఊరు-మన బడి నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి .గుండారంలోని ప్రాథమిక పాఠశాలలో సుమారు రూ.4.69 లక్షలతో చేపట్టిన మన ఊరు-మన బడి నిర్మాణ పనులు పూర్తయి సకల సౌకర్యాలతో పాఠశాల భవనం నూతన శోభను సంతరించుకుని ప్రారంభోత్సవానికి సిద్దమైంది.మొదటి విడతగా గుండారం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సుమారు రూ.41 లక్షలు(మన ఊరు-మన బడి రూ.4.69 లక్షలు) ఈజీఎస్ (ప్రహరీ గోడ,వంటశాల నిర్మాణం రూ.36.40 లక్షల) నిధులతో మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వార చేపట్టిన నిర్మాణ పనులు పూర్తయి నేడు(బుధవారం) మానకొండూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రారంభోత్సవం చేయనున్నారు.

అందుబాటులోకిరాని ఫర్నిచర్

పనులు పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్దమైన గుండారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తరగతి గదిలో ఫర్నిచర్ సామగ్రి అందుబాటులోకి రాలేదు. విద్యార్థులకు తాగు నీరు, విద్యుత్,మూత్రశాలలు, బోధన సామగ్రి పూర్తి స్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చామని ఫర్నిచర్ రవాణలో ఉందని ఎంఈఓ పావని తెలిపారు.

మన ఊరు-మన బడితో ప్రవేశాలు మెరుగు



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల పటిష్టత కోసం చేపట్టిన మన ఊరు-మన బడి కార్యక్రమం రాబోయే రోజుల్లో మంచి సత్ఫలితాలిస్తుంది. పాఠశాలల్లో ప్రభుత్వం చేపట్టిన నిర్మాణ పనులు, మౌలిక వసతులు కల్పనతో విద్యార్థుల ప్రవేశాలు మెరుగవుతాయి.ప్రభుత్వ పాఠశాలలను పటిష్టం చేయడానికి శాయశక్తుల కృషి చేస్తాను.

- రామంచ రవీందర్, ప్రధానోపాద్యాయులు

ఆనందనీయం



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మన ఊరు-మన బడి పనులు పూర్తయి మొదటి విడతగా మండలంలోని గుండారం గ్రామ ప్రాథమిక పాఠశాల మొట్టమొదటగా ప్రారంభోత్సవమవ్వడం ఆనందనీయం. మన ఊరు-మన బడి కార్యక్రమం ద్వారా నిధులు కేటాయించి పనులు పూర్తవ్వడానికి కృషి చేసిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ప్రజాప్రతినిధులు, అధికారులకు కృతజ్ఞతలు.

- శెట్టి లావణ్య, సర్పంచ్ గుండారం





సిద్దిపేటలో ఈఎస్ఐ డిస్పెన్సరీ వైద్య చికిత్స కేంద్రం ఏర్పాటు చేయాలి

బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్



నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ డిస్పెన్సనరీ వైద్య చికిత్స కేంద్రాన్ని ఈ రాష్ట్ర బడ్జెట్లోనే నిధులు కేటాయించి వెంటనే ఏర్పాటు చేయాలని బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చొప్పరి రవికుమార్ డిమాండ్ చేశారు. బిల్డింగ్ అధర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా విస్తృత స్థాయి సమావేశం జిల్లా అధ్యక్షుడు చింతల వెంకటయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా చొప్పరి రవికుమార్ హాజరై మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో సంఘటిత, అసంఘటిత కార్మికులు పెద్ద సంఖ్యలో ఉన్నప్పటికీ వారి ఆరోగ్య సమస్యలు చూడడానికి ఎలాంటి ఈఎస్ఐ (డిస్పెన్సరీ) కార్యాలయం లేదన్నారు. కార్మికుల ఆరోగ్యం క్షీణిస్తే సంగారెడ్డికి, బొల్లారం లాంటి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోందన్నారు. దీంతో దూర ప్రాంతానికి వెళ్లలేక కార్మికులు ప్రైవేటు హాస్పిటళ్లను ఆశ్రయించి వేలాది రూపాయలు కోల్పోవాల్సి వస్తుందని తెలిపారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాలను వెల్లదీస్తుంటే ఈఎస్ఐ సౌకర్యం లేకపోవడం మూలంగా మరింత నష్టం జరుగుతుందన్నారు. సిద్దిపేట కేంద్రంగానే వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ వైద్య చికిత్స కేంద్రం లేకపోవడం కార్మికులను విస్మరించడమేనన్నారు. కార్మికుల పట్ల చిత్తశుద్ధి ఉంటే మంత్రివర్యులు వెంటనే బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించి ఈఎస్ఐ హాస్పిటల్ ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ (డిస్పెన్సరీ) వైద్య చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయలేని పక్షంలో కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భాస్కర్, వెంకటేశం, సురేష్, ఉపేందర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి: ఎస్ఐ

నవతెలంగాణ- సిద్దిపేటరూరల్



చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సిద్దిపేట రూరల్ ఎస్సై కిరణ్ రెడ్డి అన్నారు. సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని రావురుకుల గ్రామంలో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కుల వివక్షతను, అంటరానితనాన్ని నిర్మూలించాలని అన్ని కులాల వారితో సోదర భావంతో మెలగాలని అన్నారు. గ్రామంలో ప్రతి ఒక్కరు చదువుకొని కుల మతాలు లేని సమాజం నిర్మించాలని దీనికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని అదేవిధంగా గ్రామంలో ఒకరు మరొకరిపై వివక్షత చూపితే చట్టపరమైన చర్యలు ఉంటాయని అందరూ సమనులే కాబట్టి కలిసిమెలిసి ఉండాలని అన్నారు. ఆర్ఐ బాలయ్య , సర్పంచ్ కవిత రవీందర్ ,ఉప సర్పంచ్ శ్రీకాంత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శిల్ప, వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

తెలంగాణ పథకాలు దేశానికి ఆదర్శం

జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి

నవ తెలంగాణ-కొమురవెల్లి





తెలంగాణ సంక్షేమ పథకాలు దేశానికి ఆదర్శమని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని టీటీడీ కల్యాణ మండపంలో బీఆర్ఎస్‌కేవీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మండల కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమపథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఇప్పటికే పలు రాష్ట్రాలు సీఎం కేసీఆర్ నాయకత్వం కోసం ఎదురు చూస్తున్నాయని, సీఎం సారథ్యంలో అమలవుతున్న సంక్షేమ పథకాలపై ప్రజలలో వస్తున్న ఆదరణ చూసి బీజేపీ, కాంగ్రెస్‌లు ఓర్వలేక అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాలను ఉచితాలుగా చిత్రీకరించి అడ్డుకోవాలని చూస్తున్నవారికి బుద్ధి చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను అడ్డుకోవాలని చూస్తున్నవారికి బుద్ధి చెప్పాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అండగా నిలిచి వచ్చే ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. అంతకు ముందు మండలంలోని అయినాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని, పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు.

మల్లన్న ఆలయంలో పనుల పరిశీలన

కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి, చైర్మన్ గీస భిక్షపతితో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా స్వామి వారి లడ్డు ప్రసాదం తయారి పై ఆరా తీసారు. స్వామి వారి బ్రహ్మెత్సవాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు. పాత బుకింగ్ రూం ను తీసి వేసి భక్తులు స్వేద తీరేవిధంగా ఏర్పాటు చేయాలని చైర్మన్ కు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి తలారి కీర్తన, వైస్ ఎంపిపి కాయిత రాజేందర్ రెడ్డి, అయినాపూర్ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, నాయకులు తలారి కిషన్, బోడుగం కిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో పథంలో గజ్వేల్ మున్సిపల్

మున్సిపల్ చైర్మన్ నేతి చిన్నరాజమౌళి

నవతెలంగాణ- గజ్వేల్





గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ శరవేయంగా అభివృద్ధి జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అన్నారు. మంగళవారం సాయంత్రం మున్సిపల్ పరిధిలోని రెండో వార్డు, 17వ వార్డు లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ ప్రేజ్ఞపూర్ మున్సిపాలిటీ పరిధిలోని అభివృద్ధిలో భాగంగా 2 వ వార్డ్ లో గల మహతి స్కూల్ వీధిలో, 17 వ వార్డ్ లోనీ ఆఫీసర్స్ కాలనీ లో జరుగుతున్న సీసీ రోడ్ల పనులను అలాగే ముత్రాజ్ పల్లి మైనారిటీ గ్రేవ్ యార్డ్ పనులను శర వేగంగా జరుగుతున్నాయని ఆయన చెప్పారు. కాంట్రాక్టర్ లకు సూచనలు చేస్తూ, నాణ్యత పాటించాలి అని ఆయన కోరారు. అలాగే ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రి తన్నీరు హరీష్ రావు కృషితో నిధులకు కోరుతా లేదన్నారు. వార్డులలో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతూ అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందని ఆయన తెలిపారు.. వారి వెంట కమిషనర్ విద్యాధర్ , కౌన్సిల్ సభ్యులు బొల్లిపల్లి బాలమణి శ్రీనివాస్ రెడ్డి, దుంబాల లక్ష్మీ కిషన్ రెడ్డి, ఏ ఈ ఈ, కిష్టన్న, ఏ ఈ శ్రీధర్ రెడ్డి, కాంట్రాక్టర్ బాలకృష్ణారెడ్డి, జిల్లా రమేష్, నాయకులు అహ్మద్, అజర్, స్వామి, అక్రమ్, వార్డ్ సభ్యులు గజ్వేల్ మున్సిపల్ టిఆర్ఎస్ యూత్ నాయకులు వినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫుల్ కోరంతో మున్సిపల్ సమావేశం



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ సాధారణ సమావేశం మంగళవారం నిండు సభలా కనిపించింది. చాలా రోజుల తర్వాత మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు సమావేశానికి హాజరు కావడంపై ఆసక్తికరంగా చర్చ జరిగింది. సిద్దిపేట జిల్లాలో చాలా చోట్ల మున్సిపల్ పాలకవర్గంపై అవిశ్వాసాలు అంటూ ప్రచారాలు జరుగుతున్న నేపథ్యంలో ఈ సమావేశానికి 19 వ వార్డు కౌన్సిలర్ గుంటుకు శిరీష రాజు తిరుపతి యాత్రలో ఉండగా మిగతా 19 మంది మున్సిపల్ సాధారణ సవేశానికి హాజరై అభివృద్ధి పనులను ఆమోదించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాతినిధ్య వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గం లో రెండు మున్సిపాలిటీలు ఉండగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్, తూప్రాన్ మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ రెండు మున్సిపాలిటీలో ఎలాంటి అవిశ్వాసులకు తావు లేకుండా మున్సిపల్ చైర్మన్ లు మెదులుకుంటున్నారు. మంగళవారం జరిగిన గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ సమావేశం తో సమావేశ మందిరం కలకలలాడింది. గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ నేతి చిన్న రాజమౌళి అధ్యక్షతన నిర్వహించగా పలు పనులకు ఆమోదం తెలిపినట్లు తెలిసింది. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షకీల్, కమిషనర్ విద్యాధర్, కౌన్సిల్ సభ్యులు బొగ్గుల చందు, బాలమణి శ్రీనివాస్ రెడ్డి, మరికంటి వరలక్ష్మి కనకయ్య, అర్చన శివకుమార్, శ్యామల మల్లేష్ యాదవ్, రజిత గౌడ్, కూరాకుల శ్రీనివాస్, మామిడి విద్యారాణి శ్రీధర్, రహీం, గంగిశెట్టి చందన రవీందర్, అత్తిలి శ్రీనివాస్, షాహినా సమీర్, అల్వాల బాలేష్, ఉప్పల మెట్టయ్య, భాగ్యలక్ష్మి దుర్గాప్రసాద్, లక్ష్మీ కిషన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, తో పాటు మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు గంగిశెట్టి రాజు, షరీఫా ఉమర్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రవేశంలో విద్యార్థి ద్వితీయ స్థానం

నవతెలంగాణ- గజ్వేల్

కేరళలో జరుగుతున్న వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గజ్వేల్ మండలం అహ్మదీపూర్ ఎనిమిదో తరగతి విద్యార్థిని వి.పూజ తెలంగాణ రాష్ట్రం నుంచి ద్వితీయ స్థానం దక్కించుకున్నది. డీఈవో శ్రీనివాస్ రెడ్డి, జిల్లా సైన్స్ అధికారి కల్లేపల్లి శ్రీనివాస్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరీముద్దీన్ విద్యార్థిని పూజను గైడ్ టీచర్ హఫీజ్‌ను అభినందించారు.



అక్బర్ పేట భూంపల్లి మండల విద్యాధికారికి ఘన సన్మానం



నవ తెలంగాణ-మిరుదొడ్డి

అక్బర్‌పేట భూంపల్లి మండల విద్యాధికారిగా జోగు ప్రభుదాసును నియమించినందుకు సిద్దిపేట జిల్లాలోని నూతనంగా ఏర్పడిన అక్బర్ పేట భూంపల్లి మండలానికి మండల విద్యాధికారిగా జోగు ప్రభుదాస్ నియామక బాధ్యతలు స్వీకరించడం పట్ల పీఆర్టీయూ నాయకులు అభినందనలు తెలిపారు. ఈ నియామకం పట్ల పి ఆర్ టి యు బృందం ఎం ఈ ఓ ప్రభుదాస్ ను శాలువాతో ఘనంగా సన్మానించారు. తమ సహాయ సహకారాలు అందిస్తామని మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిద్ధి వెంకటేశం కనకారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పి ఆర్ టి యు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సోమగారి నాగిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొండం శ్రీకాంత్ రెడ్డి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పేల రవి గజిటెడ్ ప్రధానోపాధ్యాయులు జగదీశ్వర్, అంజాగౌడ్, ప్రవీణ్ బాబు, షబానా అత్తర్ ,చక్రపాణి పుష్పవేని, భాస్కర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఉపసర్పంచుల పేర్లను శిలాఫలకాలలో వేయాలి



ఉపసర్పంచుల ఫోరం మర్కుక్ మండలాధ్యక్షులు గుర్రాల స్వామి

నవతెలంగాణ-మర్కుక్

ప్రభుత్వం చేపట్టి వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, భవనాల ప్రారంభోత్సవాలలో శిలాఫలకాలలో ఉపసర్పంచుల పేర్లను తప్పకుండా వేయాలని ఉపసర్పంచుల ఫోరం మర్కుక్ మండలాధ్యక్షులు గుర్రాల స్వామి అన్నారు. మంగళవారం ఆయన నవతెలంగాణతో మాట్లాడుతూ ఉపసర్పంచులు గ్రామాభివృద్ధికి తమవంతు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం మాత్రం అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలలో సర్పంచుల నుంచి మొదలుకొని రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధుల పేర్లను శిలాఫలకాల మీద వేసినప్పుడు, ఉపసర్పంచుల పేర్లను రాయకపోడం బాధాకరమన్నారు. ప్రభుత్వం వెంటనే ఉపసర్పంచుల ప్రభుత్వ ప్రారంభోత్సవాలలో వేసే విధంగా జీవోను తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాలలో సర్పంచులతో సమానంగా పని చేస్తున్నామని, తమకు కుడా శిలా పలకాల పైన తమ పేర్లను వేసి గౌరవం ఇవ్వాలని కోరారు.

కొనసాగుతున్న కంటి వెలుగు కార్యక్రమం









నవతెలంగాణ-తొగుట

ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేసుకోవాలని వైద్య అధికారి డాక్టర్ రాధకిషన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కంటి వెలుగు 2 నిరంతరం కొనసాగుతుందన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి వెలుగులో బాగంగా ఆరవ రోజు 165 మంది స్క్రీనింగ్ చేశామని తెలిపారు. 7 మందికి కంటి శుక్లాలు,15 మందికి కంటిపై కొవ్వు,ఇరువురికి మెల్లకన్ను,16 మందికి చదువు కోసం ఉపయోగించే అద్దాలు,25 మందికి అద్దాలు ఆడర్ చేయింస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్ర మంలో హెల్త్ సూపర్వైజర్ శ్యామల,ఏఎన్ఎం లు రజిని,అనురాధ,అప్తమ అప్తో మెట్రిస్ట్ సాయిలు, ఆశా కార్యకర్తలు, స్వేచ్ఛ, కవిత, లావణ్య మహేశ్వరి, పుష్పలత తదితరులు ఉన్నారు.

నవ తెలంగాణ - సిద్దిపేట: కంటి వెలుగుతో నిరుపేదల జీవితాల్లో వెలుగులు వస్తున్నాయని, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు పేదలకు అండగా ఉన్నారని 3వ వార్డు కౌన్సిలర్ వంగ రేణుక తిరుమల్ రెడ్డి అన్నారు. మంగళవారం 3వ వార్డులోని వార్డు కార్యాలయంలో కంటి వెలుగు కేంద్రాన్ని వైస్ చైర్మన్ జంగిటి కనకరాజుతో కలిసి ఆమె ప్రారంభించారు. 22 వ వార్డులో సంఘమిత్ర డిగ్రీ కళాశాలలో కంటి వెలుగు కేంద్రాన్ని వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, వార్డు కౌన్సిలర్ ఎడ్ల అరవింద్ రెడ్డి ,బి ఆర్ ఎస్ పట్టణ అధ్యక్షులు కొండం సంపత్ రెడ్డి లు ప్రారంభించారు. మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి పట్టణంలోని కంటి వెలుగు కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆయా అవార్డుల ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ-మిరు దొడ్డి : తెలంగాణ ప్రభుత్వం పేద ప్రజలకు కంటి వెలుగు ద్వారా ఉచిత పరీక్షలు నిర్వహించుకోవాలని ఉద్దేశంతో ప్రభుత్వం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఎంపీడీవో రాజిరెడ్డి, ఏపీఎం కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మిరుదొడ్డి మండల కేంద్రంలో ఐకెపి సిబ్బంది ఆధ్వర్యంలో కంటి వెలుగు పరీక్షలు నిర్వహించుకొని లబ్ధిదారులను గుర్తించి పరీక్షలు నిర్వహించుకోవాలని ఇంటింటి సర్వే నిర్వహించారు. ఎవరైనా కంటి వెలుగు పరీక్షలు నిర్వహించుకోకుంటే ఎవరైనా కంటి వెలుగు పరీక్షలు నిర్వహించుకొని వారు ఉంటే మీరు దొడ్డి గ్రామపంచాయతీ వద్ద ఉచితంగా కంటి వెలుగు కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వారు తెలిపారు ఈ యొక్క అవకాశాన్ని గ్రామస్తులు సద్విని చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐకెపి సిబ్బంది వైకుంతం మంగమ్మ, ప్రియాంక, లక్ష్మి, సుమలత తదితరులు పాల్గొన్నారు.

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని స్వాధ్వినియోగం చేసుకోవాలని, కంటి సమస్యలు ఉన్నవారు పరీక్షలు నిర్వహించుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం రంగాదం పల్లి లో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయన వెంట స్థానిక కౌన్సిలర్ వంగ రేణుక తిరుమల్ రెడ్డి, స్థానిక నాయకులు రంగదాంపల్లి శ్రీనివాస్,ఐలయ్య, పిఎసిఎస్ వైస్ చైర్మన్ దుర్గారెడ్డి, శ్రీనివాస్, నిమ్మ మహేందర్రెడ్డి, కంటి వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ- గజ్వేల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గజ్వేల్ స్థానిక సమీకృత కార్యాలయంలోగజ్వేల్ సి' బ్లాక్‌లో గడా అధికారి ముత్యం రెడ్డి ఆధ్వర్యంలో ఉద్యోగులకు కంటి పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ డా.యాదవ రెడ్డి, మున్సిపల్ చైర్మన్. ఎన్.సి.రాజమౌళి, వైస్ చైర్మన్ జకియోద్దీన్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదా సు శ్రీనివాస్, గజ్వేల్ ఏ టి ఓ శ్రీ.హైదర్ అలీ, ఏడీ అగ్రికల్చర్ శ్రీ బాబునాయక్, గడా ఎం.పి డి ఓ, పట్టాభిరామారావు, డిప్యూటీ ఎక్జిక్యూటివ్ ఇంజనీర్, అజయ్ ,, మార్కెట్ కమిటీ సెక్రటరీ పి. జాన్ వెస్లీ, స్థానిక కౌన్సిలర్లు, కంటి వెలుగు డిప్యూటీ డీఎం%డ% హెచ్ ఓ, డా.విజయ రాణి, డా. రాహూల్, డా. ఖాసిం, గజ్వేల్ టిఎన్జీవో అధ్యక్షుడు బి.లింగం, కార్యదర్శి . ఎన్.శ్రీధర్ అసోసియేట్ అధ్యక్షులు శివప్రసాద్, వై.రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరీ,ఇరిగేషన్ శాఖ ఉద్యోగి శ్రీకాంత్, కార్యాలయ ఉద్యోగులు, వైద్య బృందం పాల్గొన్నారు.

విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి



నవ తెలంగాణ-మిరుదొడ్డి

విద్యార్థులకు పౌష్టికాహారం సకాలంలో అందించాలని ఉపసర్పంచ్ పరుశరాములు అన్నారు. మంగళవారం అక్బర్ పేట భూంపల్లి మండలం రుద్రారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు, అంగన్వాడీ సెంటర్లలో పిల్లలకు అల్పాహారాన్ని ఆయన సొంత ఖర్చుతో అందించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామ యువకులు తంగళ్ళపల్లి బైరవ చారి .కానుగంటి భానుచందర్ తదితరులు పాల్గొన్నారు.

షిర్డి పాదయాత్ర భక్తులకు అల్పాహారం



నవ తెలంగాణ - సిద్దిపేట

ఖమ్మం జిల్లా రఘునాథపాలెం గ్రామం నుంచి షిర్డికి పాదయాత్రగా వస్తున్న భక్త బృందానికి రంగదాంపల్లి హనుమాన్ దేవాలయం వద్ద వాసవీక్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం అందజేశారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు వాసుదేవరావు మాట్లాడుతూ సిద్దిపేట వాసవీ క్లబ్ సేవలు అభినందనీయమన్నారు. సేవా కార్యక్రమాల్లో సిద్దిపేట వారు ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్టిక్ట్ ఇన్చార్జి మాంకాల నవీన్ కుమార్ ,వాసవి క్లబ్ అధ్యక్షుడు చింత రాజేంద్రప్రసాద్, కార్యదర్శి చకిలం రవి, కోశాధికారి బూర్గు వేణు, పీఆర్వో అయిత శంకర్ , వాసవి యూత్ క్లబ్ అధ్యక్షుడు అరవపల్లి హరికిరణ్, గందె శ్రీనివాస్, జూలూరు శ్రీనివాస్, చిరంజీవి రఘు పాల్గొన్నారు.

సీపీఐ నియోజకవర్గం కమిటీ ఎన్నిక



నవ తెలంగాణ- గజ్వేల్

భారత కమ్యూనిస్టు పార్టీ గజ్వేల్ నియోజకవర్గ నూతన కమిటీని ఎన్ను కున్నారు. నియోజకవర్గ కన్వీనర్‌గా నర్సింహారెడ్డి, కొకన్వీనర్‌గా శివలింగు కృష్ణ, సహాయ కార్యదర్శిగా చింత శ్రీను, కోశాధికారిగా చిక్కుడు రాజు కమిటీ సభ్యులుగా కనుగులా భూమయ్య, రామగళ్ల నరేష్, కిచెన్నగారి వంశీ, ఎల్ల స్వామి, నర్సింహులను ఎన్నుకున్నారు.

ఘనంగా రేణుక ఎల్లమ్మ కల్యాణం



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని పాతూరు గ్రామంలో గల రేణుక ఎల్లమ్మ దేవాలయ 13 వ వార్షికోత్సవ వేడు కలలో భాగంగా రేణుక ఎల్లమ్మ కల్యాణాన్ని నిర్వాహ కులు బూకల బాగమ్మ, మామిడ్ల యాదగిరి యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. రేణుక ఎల్లమ్మ కల్యాణం సందర్భంగా పట్నాలు వేసి,అమ్మవారి నైవేద్యం సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు ఆదిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

అగ్నిపథ్‌కు ఎంపికైనందున సన్మానం



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు ఉన్నత పాఠశాలలో 2019 లో పదో తరగతి చదువుకున్న ఉగ్గి తిరుపతి ఇటీవల నిర్వహిం చిన అగ్నిపథ్ (ఆర్మీ) రిక్రూమెంట్ అగ్నివీరునిగా ఎంపికయ్యారు. మంగళవారం పాఠశాలలో ఆయనను విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు ఘనంగా సన్మా నించారు. అగ్నిపథ్‌లో ఎంపికైన తిరుపతికి మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు డి. రవీందర్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన



నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

హుస్నాబాద్ మండలంలోని కుచనపల్లి గ్రామంలో మన ఊరు మన బడిలో ప్రారంభోత్సవం చేసే పాఠశాలను మంగళవారం డీఈవో శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో నిర్మాణం పనులు ఏమైనా పెండింగ్ లో ఉన్నాయని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ కుమారస్వామి, ఎంఈఓ దేశి రెడ్డి , పంచాయతీ కార్యదర్శి రాజమ్మ పాల్గొన్నారు.

తోటి స్నేహితునికి ఆర్థిక సాయం

నవతెలంగాణ జగదేవపూర్

జగదేవపూర్ మండలం మునిగడప గ్రామానికి చెందిన కారింగుల కరుణాకర్ కొద్దీ రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న స్నేహితులు మంగళవారం పరామర్శించి రూ.6,500 ఆర్థిక సాయం అందించారు. కొలిచెల్మా హరిగౌడ్, శ్రీధర్, చంద్రమౌళి, భాను, వెంకటేష్ , శివకుమార్, శ్రీశైలం తదితరులు ఉన్నారు

చదువుతో పాటు ఆటలు ముఖ్యం

అడిషనల్ డీసీపీ మహేందర్



నవ తెలంగాణ - సిద్దిపేట

విద్యార్థులు కేవలం ర్యాంక్ పైనే కాకుండా ఆటలపై శ్రద్ధ వహించాలని, చదువుతో పాటుగా క్రీడలు ముఖ్యమేనని అడిషనల్ డీసీపీ మహేందర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని రావుస్ టెక్నో స్కూల్లో జోనల్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడిషనల్ డీసీపీ, ఎంఈఓ యాదవ రెడ్డి, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ మెంబర్ పాల సాయిరాం, రావుస్ పాఠశాలల సీఈవో నిదిన్ రావులు జ్యోతి ప్రజ్వలన చేసి విద్యార్థుల కవాతును తిలకించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక కాలంలో కేవలం చదువుపైనే తల్లిదండ్రులు, విద్యార్థులు దృష్టి కేంద్రీకరిస్తున్నారన్నారు. దీంతో ఆటలను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. విద్యార్థులు శారీక, మానసిక ఆరోగ్యం సమతుల్యం కోల్పోతుందన్నారు. ఆటలతో విద్యార్థుల్లో మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. విద్యార్థుల్లో లీడర్షిప్ పెరుగుతుందని, సమస్యలు ఎదురైనప్పుడు ఎదుర్కొనే మానసిక స్థైర్యం పెంపొందుతుందన్నారు. చదువులో రాణించాలన్న ఏకగ్రత అవసరమని, ఏకగ్రత అనేది ఆటలతో లభిస్తుందన్నారు. యోగా, క్రీడలు, చదువులో ఒక భాగంగా ఉండాలని, అపుడే విద్యార్థులు మానసిక ఒత్తిడిని తట్టుకొని, అన్ని రంగాల్లో రాణించే అవకాశం ఉందన్నారు. ప్రైవేట్ పాఠశాలలు స్పోర్ట్స్ మీట్ నిర్వహించడం సంతోషంగా ఉందని, ఇదే దోరణిని కొనసాగించాలన్నారు. అంతకు ముందు విద్యార్థులు చేసిన సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ స్పోర్ట్స్ మీట్ మంగళ, బుధవారాలు కొనసాగునున్నాయి. ఈ స్పోర్ట్స్ మీట్లో వెయ్యి మంది వరకు క్రీడాకారులు ఐదు బ్రాంచ్ ల నుంచి పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తిరుపతి, ఆయా బ్రాంచ్ ల ఉపాధ్యాయులు, పీఈటీలు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి



నవ తెలంగాణ - సిద్దిపేట

నూతన జాతీయ విద్యా విధానం అమలును రద్దు చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహేష్, శ్రీకాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం సిద్దిపేటలో పీ.డీ.ఎస్.యు జిల్లా కమిటీ సమావేశం జిల్లా అధ్యక్షుడు మహేష్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన జాతీయ విద్య విధానాన్ని రాష్ట్రంలో అమలు నిరాకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా రాష్ట్ర బడ్జెట్ లో విద్య రంగానికి 30 శాతం నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయడంలో ప్రభుత్వం తీవ్రంగా విఫలం అయ్యిందని ఆరోపించారు. ప్రభుత్వ విశ్వ విద్యాలయాలలో సమస్యలు అలాగే ఉన్నాయని, వేలాది బోధన ,బోధనేతర పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ , వాటిని వెంటనే భర్తీ చేయాలనీ కోరారు. సిద్దిపేట జిల్లాలో ప్రభుత్వ విశ్వ విద్యాలయాలయం నెలకొల్పి, ఉన్నత విద్యను అభివృద్ధి చేయాలనీ, ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో అసెంబ్లీ సమావేశాలను అడ్డుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీ.డీ.ఎస్.యు సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి విద్యనాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు సందీప్, జిల్లా కమిటీ సభ్యులు ప్రణయ్ కుమార్, పవన్, హుస్సేన్, హిమవ0త్ కృష్ణ, లక్ష్మన్, గణేష్, అరవింద్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గజ్వేల్ అభివృద్ధే సీఎం లక్ష్యం



నవతెలంగాణ- గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధి ప్రధాన లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ ముందుకు వెళ్తున్నారని గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ 15వ వార్డు కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య అన్నారు. మంగళవారం ఆయన ఇంటిలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ అభివృద్ధికి ప్రత్యేక దృష్టి పెట్టినట్లు ఆయన చెప్పారు. మున్సిపల్ అభివృద్ధికి 23 కోట్ల రూపాయలు కేటాయించి అభివృద్ధి చేస్తున్నట్టు చెప్పారు. అదేవిధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ గజ్వేల్ నియోజకవర్గం నుండి 2014, 2018 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ముఖ్యమంత్రి అయ్యారని ఆయన గుర్తు చేశారు. 60 సంవత్సరాల వెనకకు ఉన్న గజ్వేల్ అభివృద్ధిని ఎనిమిది సంవత్సరాల్లో 100 సంవత్సరాల్లో వరకు గుర్తుండిపోయే పనులను గజ్వేల్ లో చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. బి ఆర్ ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆయన చెప్పారు. మరో 20 సంవత్సరాలు బి ఆర్ ఎస్ పార్టీ అధికారంలో ఉంటుందని చావు బతుకులో ఉన్న కాంగ్రెస్ బిజెపిలకు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ ముసలి రాజకీయాన్ని గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు, తెలంగాణ ప్రజలు కోరుకోవడం లేదని ఆయన పేర్కొన్నారు, మతతత్వ పార్టీ బిజెపి కి ఓటు వేసే ప్రజలు లేరని ప్రస్తుతం ప్రజలకు సేవ చేసే భాగ్యం బి ఆర్ ఎస్ పార్టీ కే ఉందన్నారు. గజ్వేల్ కు ఇప్పుడు దేశంలోనే గుర్తింపు ఉందని ఆయన అన్నారు. అంతేకాకుండా నిరంతరంగా గజ్వేల్ అభివృద్ధిపై రాష్ట్ర ఆర్థిక ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టి నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. మున్సివల్ పరిధిలోని 15 వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నట్లు చెప్పారు.

డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వం విఫలం



నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల ప్రాంతంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా సమితి సభ్యులు ఈరి భూమయ్య అన్నారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రతీ నిరుపేద కుటుంబానికి డబల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మించి పంపిణీ చేస్తామని అనేక ప్రగల్భాలు పలికి పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ఏదో ఒక గ్రామంలో కొద్ది గొప్ప ఇండ్లు నిర్మించి చేతులు దులుపుకుందని ఎద్దేవా చేశారు. చేర్యాల పట్టణంతోపాటు పలు గ్రామాలలో డబల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తూ ప్రజల ఆశలను నీరుగార్చిందన్నారు.ఇప్పటికైనా జిల్లా మంత్రి హరీష్ రావు, స్థానిక ఎమ్మెల్యే యాదగిరిరెడ్డి దృష్టి సారించి వెంటనే ఇండ్ల నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు.భూమయ్య వెంట పార్టీ మండల సహాయ కార్యదర్శి బండారి సిద్దులు, పట్టణ కార్యదర్శి ఉడుగుల శ్రీనివాస్ ఉన్నారు.

21 షటర్లలో 4 మాత్రమే వేలం



నవతెలంగాణ-దుబ్బాక

దుబ్బాక పురపాలిక కేంద్రంలోని 1వ వార్డులో డబుల్ బెడ్ రూమ్‌ల సముదాయం వద్ద నిర్మించిన 8 వాణిజ్య దుకాణాలకు 3 దరఖాస్తులు, 14వ వార్డులో నిర్మించిన 13 దుకాణాలకు కేవలం ఒకే ఒక దుకాణానికి దరఖాస్తు చేసుకున్నారని, వాటికి మాత్రమే బహిరంగ వేలం నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ పాతురి గణేష్ రెడ్డి తెలిపారు. మంగళవారం దుబ్బాక పురపాలక సంఘ కార్యాలయంలో మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూమి రెడ్డి సమక్షంలో నిర్వహించిన బహిరంగ వేలంలో 21 వాణిజ్య దుకాణ దుకాణాలకు గాను కేవలం నాలుగు (డబుల్ బెడ్ రూమ్ ల వద్ద 2,4,5 నెంబర్ల,14 వ వార్డు శాస్త్రి విగ్రహం వద్ద 6 వ నెంబర్) దుకాణాలకు బహిరంగ వేలం పాట నిర్వహించడం జరిగిందన్నారు.ఒక్కో దుకాణానికి నెలకు రూ.3200 చొప్పున అద్దెను నిర్ణయించామన్నారు.మిగతా 17 దుకాణాలకు మరోసారి బహిరంగ వేలం ప్రకటన వారంలోగా జారీ చేస్తామన్నారు.

దీక్షకు కేవీపీఎస్ మద్దతు



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండలం పరిదిలోని చాట్లపల్లి గ్రామంలో అంబేద్కర్ భవన నిర్మాణం అడ్డుకుంటున్న వ్యక్తులపై చర్య తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు బక్కిలి బాలకిషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చాట్లపల్లి గ్రామంలో కొనసాగుతున్న దీక్షకు మంగళవారం కెవిపిఎస్ తరుపున మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాల క్రితం గ్రామపంచాయతీ తీర్మానం చేసి అంబేద్కర్ భవనానికి కేటాయించిన స్థలాన్ని కొంతమంది వ్యక్తులు ఆక్రమించుకొవడానికి ప్రయత్నించగా అడ్డుకొని ఆ స్థలం అంబేద్కర్ సంఘానిదని అంబేద్కర్ సంఘం నాయకులు వాళ్ళని ఎదిరించి రిలే నిరాహార దీక్షలు చేపట్టారన్నారు. అదేవిధంగా గ్రామంలోని వివిధ కులాలు చెందిన భవనాలను పాత గ్రామపంచాయతీని యాదవ సంఘానికి కేటాయించగా, పశువుల దవాఖాను ముదిరాజ్ సంఘానికి గత డిసెంబర్ మాసంలో రాత్రికి రాత్రి కలర్లు వేసి బోర్డ్ లు మార్చారు అన్నారు. అంబేద్కర్ భవనానికి కడదామంటే పర్మిషన్ లేదంటున్నారు. ఇది చాలా బాధాకరమైన విషయం అన్నారు. ఈ విషయంపై పై స్థాయి అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి అని కేవీపీఎస్ జిల్లా కమిటీ తరుపున తీవ్రంగా ఖండిస్తుంది అన్నారు. తక్షణమే ఎస్సిలకు న్యాయం చేయాలని తెలిపారు లేని యెడల ఉద్యమాన్ని ఉదృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు తదితరులు ఉన్నారు.

పాఠశాలకు రూ.లక్ష విరాళం



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని ఎర్రవల్లి ఫంక్షన్ హాల్ నిధుల నుంచి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న విద్యా వలంటీర్ల వేతనాల కోసం లక్ష రూపాయల విరాళం మంగళవారం గ్రామ సర్పంచ్ భాగ్య బిక్షపతి ఆధ్వర్యంలో ఫంక్షన్ హాల్ కమిటీ చైర్మన్ కొమురయ్య, ఎంపిటిసి ధనలక్ష్మి కృష్ణ, ఎస్, ఎమ్, సి చైర్మన్ బాబు, ఉప సర్పంచ్ కనకయ్య చేతుల మీదుగా పాఠశాల హెచ్ఎం సంధ్యారాణికి అందజేశారు. అనంతరం సర్పంచ్ భాగ్య బిక్షపతి గారు మాట్లాడుతూ ఎర్రవల్లి పాఠశాలలోని ప్రభుత్వ ఉపాధ్యాయులు తక్కువగా ఉండడంతో విద్యా వ్యవస్థ కుంటు పడకుండా గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు సహకారంతో విద్యా వాలంటీలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. వాలంటీర్ల వేతనాల కోసం ఫంక్షన్ హాల్ కమిటీ ముందుకు రావడం అభినందనీయమన్నారు. దాతలు మరింత ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫంక్షన్ హాల్ కమిటీ సభ్యులు నవీన్ రెడ్డి, పరుశురాం, యాదగిరి, కృష్ణ, నాయకులు సత్యం, ఉపాధ్యాయులు కుమార్, బిక్షపతి తదితరులున్నారు.

గజ్వేల్ అసెంబ్లీ స్థానం టికెట్ కోసం

కాంగ్రెస్‌లో త్రిముఖ పోటీ



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ కోసం ముగ్గురు నేతలు ప్రతిసారి పోటీ పడుతున్నారు. చివరకు గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు తూముకుంట నర్సారెడ్డికి అధిష్టానం మొగ్గు చూపుతుంది. 2009 నుంచి గజ్వేల్ అసెంబ్లీ స్థానం జనరల్‌గా మారింది. అంతకుముందు ఎస్సీలకు రిజర్వేషన్ ఈ స్థానం 2009 నుంచి జనరల్ స్థానంగా మారడంతో అప్పటివరకు స్థానిక, స్థానికేతుర దళితులు పోటీ చేశారు. దళితులు పోటీ చేసినప్పటికీ, రెడ్డి, రావుల సామాజిక వర్గమే రాజ్యమేలింది. రెడ్డి, రావుల సామాజిక వర్గాలవారు గెలిచిన దళిత ఎమ్మెల్యేలు వారి కనుసన్నల్లోనే ముందుకు వెళ్లేవారు. రెడ్డి, రావుల సామాజిక వర్గాల వ్యతిరేకంగా మాట్లాడిన ఎమ్మెల్యేలను మార్చుతూ కొత్త వ్యక్తులను తీసుకొచ్చేవారు. ఇందులో ఎక్కువ శాతం తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరి నేతలను మారుస్తూ రావు సామాజిక వర్గం తన ప్రాబల్యం చూపించింది. కాంగ్రెస్ పార్టీ నుంచి స్థానికులకు నాలుగు దశాబ్దాలుగా ఎస్సీలకు ఎమ్మెల్యే స్థానం దక్కింది. జనరల్ స్థానంగా మారడంతో రెడ్డి, రావుల సామాజిక వర్గాలు ఎమ్మెల్యే స్థానం కోసం పోటీ పడ్డాయి. కాంగ్రెస్ విషయానికి వస్తే గజ్వేల్ నియోజకవర్గంలోని వర్గల్ మండలం కేంద్రం చెందిన తూముకుంట నర్సారెడ్డి సర్పంచ్‌గా, ఎంపీపీగా, జిల్లా సహకార బ్యాంకు చైర్మన్‌గా పదవులు అనుభవిస్తూ తన రాజకీయ శక్తిని తంత్రి ద్వారా అందిపుచ్చుకొని ముందుకు సాగారు. గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గం జనరల్ స్థానంగా మారిన తర్వాత తొలి ఎమ్మెల్యేగా తూముకుంట నర్సారెడ్డి 2009లో గెలుపొందారు. గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ గ్రామానికి చెందిన పీసీసీ కార్యదర్శి పొన్నాల రఘుపతిరావు, గజ్వేల్ మండలం కొడకండ్ల గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్సీ మాదాడి రంగారెడ్డి కుమారుడు మాదాడి జశ్వంత్‌రెడ్డి, గజ్వేల్ మండలం జాలిగామ గ్రామం చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు బండారు శ్రీకాంత్ రావు గజ్వేల్ అసెంబ్లీ స్థానం నుంచి టికెట్ కోసం ప్రయత్నం చేశారు. 2009 నుంచి తీవ్ర ప్రయత్నం చేస్తున్నా ఫలించడం లేదు. 2009లో అప్పటి పీసీసీ అధ్యక్షులు వైయస్ రాజశేఖర్ రెడ్డి వద్ద స్థానిక జిల్లా సహకార బ్యాంకు చైర్మన్ తూముకుంట నర్సారెడ్డికి మంచి పట్టు ఉండేది. అప్పటి ఉమ్మడి మెదక్ జిల్లా నేతలందరూ నర్సారెడ్డికి టికెట్ ఇవ్వాలని ప్రయత్నం చేశారు. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ గ్రామం చెందిన పీసీసీ కార్యదర్శిగా పనిచేసిన పొన్నాల రఘుపతిరావు గట్టి పోటీ ఇచ్చినప్పటికీ టికెట్ దక్కలేదు. నర్సారెడ్డికి టికెట్ దక్కడంతో పొన్నాల రఘుపతిరావు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి టీఆర్ఎస్‌లో చేరిపోయారు. అప్పట్లో పొన్నాల రఘుపతిరావుకు మాజీ మంత్రి గీతారెడ్డి మద్దతు ఇచ్చినప్పటికీ ఉమ్మడి మెదక్ జిల్లాలో కాంగ్రెస్ నేతలు నర్సారెడ్డికి బాసటగా నిలిచారు. ఆ తర్వాత 2009, 2014, 2018 ఎన్నికల్లో తూముకుంట నర్సారెడ్డికి టికెట్ రాకుండా కాంగ్రెస్ నాయకులు మాదాడి జస్వంత్ రెడ్డి, బండారు శ్రీకాంత్ రావు టికెట్ల విషయంలో గట్టి పోటీ ఇస్తూ అధిష్టానం వద్ద ఒత్తిడి తీసుకొస్తున్నారు. పీసీసీ నేతలతో తరచూ జస్వంత్ రెడ్డి, బండారు శ్రీకాంత్ రావు టచ్‌లో ఉంటున్నప్పటికీ నర్సారెడ్డి పాచికల ముందు వీరు నిలబడలేక పోతున్నారు. ప్రస్తుతం 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తమకే టికెట్ వస్తుందని మాదాటి జస్వంత్ రెడ్డి, బండారు శ్రీకాంత్ రావు గజ్వేల్ నియోజకవర్గంలో తరచూ పర్యటిస్తూ బాధిత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటున్నారు. నర్సారెడ్డి తర్వాత మాదాడి జస్వంత్‌రెడ్డి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ప్రస్తుతం మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర్ రాజనర్సింహ వర్గంలో జస్వంత్‌రెడ్డి కొనసాగుతున్నారు. ఇటీవల డీసీసీ అధ్యక్ష పదవుల విషయంలో కూడా దామోదర్ రాజనర్సింహ జస్వంత్ రెడ్డి, బండారు శ్రీకాంత్ రావు పేర్లను ప్రతిపాదించారు. పీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డి వైపు మొగ్గుచూపి రెండోసారి జిల్లా అధ్యక్ష పదవి, బాధ్యతలు అప్పగించారు. ఈసారి కూడా నర్సారెడ్డికే అవకాశాలు ఎక్కువ ఉన్నాయని గాంధీ భవన్ వర్గాలు, స్థానిక కార్యకర్తలు, పార్టీ సీనియర్ నాయకులు చెప్పుకొస్తున్నారు. గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్లో గ్రూప్ తగాదాలు మూడు పువ్వులు, ఆరు కాయలుగా వర్ధిల్లుతున్నాయని చెప్పాలి. ఈసారి కూడా జశ్వంత్‌రెడ్డి, బండారు శ్రీకాంత్‌రావుకు టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నర్సారెడ్డితో పాటు గజ్వేల్ నియోజకవర్గం లోని ఎనిమిది మండలాల పార్టీ అధ్యక్షులు, బూత్ కమిటీల కన్వీనర్ల అభిప్రాయాన్ని అధిష్టానం తీసుకుంటుంది. ఏది ఏమైనా టికెట్ విషయాల్లో జిల్లా అధ్యక్షుని అభిప్రాయం వరకే నిర్ణయం ఉంటుందని చెప్పాలి. రాజకీయ పలుకుబడి ఢిల్లీ స్థాయిలో ప్రయోగించే సత్తా నర్సారెడ్డికి ఉందని చెప్పాలి. బండారు శ్రీకాంత్‌రావు, జస్వంత్‌రెడ్డి సైతం బంధుత్వాలు, పార్టీ సీనియర్లతో మంచి పరిచయాలు ఉన్నాయి. అవి టికెట్ పోటీ వరకు ఏఐసీసీకి పంపే లిస్టులో పేర్లు చేర్చే వరకు పని చేస్తున్నాయి.. ఏఐసీసీ మాత్రం జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుల అభిప్రాయాలు, ఆ జిల్లాలో ఉన్న పార్టీ మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ల అభిప్రాయం కూడా సేకరిస్తుందని చెప్పాలి. ఈసారి జశ్వంత్ రెడ్డి, బండారు శ్రీకాంత్ రావు ప్రయత్నాలు ఎంతవరకు పనిచేస్తాయో వేచి చూడాలి.

పింఛన్ రూ.5 వేలు అందించాలి

నవ తెలంగాణ-మిరు దొడ్డి

కుల వృత్తులకు ప్రభుత్వం ఆసరా పింఛన్ రూ.ఐదువేలు అందించాలని నాయిని బ్రాహ్మణ కమిటీ సంఘం సభ్యులు పయ్యావుల బాలరాజు అన్నారు. మంగళవారం మిరుదొడ్డి మండలం లోని చెప్యాల గ్రామంలో మంగళవారం మిరుదొడ్డి మండల నాయీ బ్రాహ్మణ బాడీ కమిటీ అధ్యక్షులు పయ్యావుల బాలరాజునాయీ ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. చెప్యాల గ్రామ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు చంద్రయ్య ఉపాధ్యక్షులు కిష్టయ్య మరియు ఎల్లయ్య నర్సింలు అంజయ్య ,మండల అధ్యక్షులు పయ్యావుల బాలరాజునాయీ శాలువాలతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయీ బ్రాహ్మణ బాడీ కమిటీ సభ్యులు కోశాధికారి పయ్యావుల యాదగిరినాయీ సలహాదారులు పసుపునూరి నరేందర్ నాయీ మరియు గ్రామ నాయీ సోదరులు కర్ణాకర్ స్వామి తదితరులు పాల్గొన్నారు.